ఐక్యతను చాటేలా గణేష్ ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం) : దేశభక్తి, ఐక్యతను చాటేలా సెప్టెంబరు 7న గణేష్ ఉత్సవాలు నిర్వహించాలని విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పిట్టు నాగేశ్వరరావు తెలిపారు. గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 7 నుంచి 5రోజులు ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆయన తెలిపారు. 11వ తేదీన స్వర్ణాల చెరువు గణేష్ ఘాట్‌లో వినాయక విగ్రహాల నిమజ్జం జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 4 ఉత్సవ నిర్వాహకులతో సమావేశం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీ.సురేంద్రరెడ్డి, వేలూరి మహేష్, నవీన్, శ్రీకాంత్, మండ్ల ఈశ్వరయ్య, ఏవీఆర్ మోహన్‌రావు, రంగరాజన్, హర్షవర్ధన్, కేవీ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

నాటి పాపాల దస్త్రాలు భద్రమేనా!?

మదనపల్లి ఘటనతో ఉలికిపాటు

- గత ప్రభుత్వంలో అనేక భూకుంభకోణాలు
- అనర్హులకు అసైన్డ్‌భూములు ఇచ్చినట్లు ఆరోపణలు
- నాడు జాబితా కూడా బయటపెట్టని అధికారులు
- ఇప్పటికే పలు ఆర్డీవో కార్యాలయాల్లో కనిపించని ఫైళ్లు
- కొన్నింటిని మాయం చేసినట్లు ప్రచారం
- రికార్డుల భద్రతపై కలెక్టర్ ఆరా
- ఒక్క రికార్డూ చేజారకూడదంటూ ఆదేశాలు

అన్నమయ్య జిల్లా మదనపల్లి సబ్‌కలెక్టర్ తగలబడటం వెనుక 'కుట్ర' ఇప్పటికే బహిర్గతమైంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డికి సంబంధించిన భూముల వ్యవహారాలతో ముడిపడిన ఫైళ్లు అక్కడే ఉండటం... అత్యంత కీలకమైన నిషేధిత భూముల జాబితా సెక్షన్‌లోనే అగ్గి రాజుకోవడంతో అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ ఘటన నేపథ్యంలో మన జిల్లాలోని రెవెన్యూ రికార్డులు భద్రంగానే ఉన్నాయా!? గత ప్రభుత్వంలో జరిగిన అనేక భూ వ్యవహారాలకు సంబంధించిన రికార్డులు కార్యాలయాల్లోనే ఉన్నాయా!? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విచ్చలవిడిగా రెవెన్యూ రికార్డులను మార్చేసి అనేక మంది రెవెన్యూ సిబ్బంది సస్పెండ్ అయిన ఉదంతాలు ఇప్పుడు గుర్తుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఓ ఆనంద్ కూడా ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లోని రికార్డుల భద్రతపై ఆరా తీశారు. ఒక్క రికార్డు కూడా కార్యాలయం నుంచి బయటకు వెళ్లడానికి వీల్లేదంటూ సదరు అధికారులకు ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.



వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖ అవినీతిలో కూరుకుపోయింది. అప్పటి అధికార పార్టీ నేతలు రెవెన్యూ కార్యాలయాలను తమ సొంత జాగీరుగా మార్చుకొని ఇష్టానుసారంగా రికార్డులు తారుమారు చేయించారు. రెవెన్యూ సిబ్బంది కూడావారిక వత్తాసు పలికారు. పొదలకూరు, వెంకటాచలం, సైదాపురం, రాపూరు, నెల్లూరు రూరల్, బుచ్చి, ఏఎస్‌పేట, సీతారామపురం, ఉదయగిరి, కావలి, దగదర్తి వంటి అనేక మండలాల్లో భారీ ఎత్తున భూ వివాదాలు తలెత్తాయి. ఇష్టానుసారంగా రికార్డులు మార్చేయడమే కారణమని నాటి అధికారులు తేల్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సుమారు వంద మంది వరకూ తహసీల్దార్ నుంచి వీఆర్వో స్థాయి వరకు రెవెన్యూ సిబ్బంది సస్పెండ్ అయ్యారు. కొంతమంది అక్రమార్కులు జైలుకు కూడా వెళ్లారు. ప్రభుత్వ భూముల స్థానంలో ప్రైవేటు వ్యక్తుల పేర్లు చేర్చారు. వేలాది ఎకరాల ప్రభుత్వ భూములు పరులపాలయ్యాయి. అప్పటి ప్రతిపక్ష పార్టీ అయిన టీడీపీ నేతలు వైసీపీ భూ కుంభకోణాలపై ఆరోపణలు చేస్తూ వచ్చారు. గతంలో జరిగిన భూరికార్డుల మార్పులపై విచారణ జరిపితే అక్రమాల పుట్ట బద్ధలవుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● పేదల మాటున అక్రమాలు

అసైన్‌మెంట్ భూముల పేరుతో భారీ కుంభకోణానికి తెరలేపారు. దాదాపు 8 వేల ఎకరాలను అసైన్‌మెంట్ కింద పేదలకు పంపిణీ చేసినట్లు నాటి ప్రజాప్రతినిధులు ప్రకటించారు. కానీ ఆ జాబితాను ఎక్కడా బయటపెట్టలేదు. ఆఖరుకు టీడీపీ నేతలు సమాచార హక్కు చట్టం ద్వారా ఈ వివరాలను అడిగినా ఇవ్వలేదు. నిబంధనల ప్రకారం అసైన్‌మెంట్ భూముల అర్హులను ఎంపిక చేసేందుకు గ్రామసభలు నిర్వహించాలి. అప్పుడు సదరు దరఖాస్తుదారు అర్హుడా.. కాదా.. అన్నది తేలుతుంది. కానీ జిల్లాలో ఎక్కడా గ్రామసభలు నిర్వహించలేదు. చివరకు అసైన్‌మెంట్ కమిటీ సమావేశాన్ని కూడా నిర్వహించలేదు. ఇన్‌చార్జ్ మంత్రి నుంచి కింది స్థాయి తహసీల్దార్ వరకూ ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్దనే సంతకాలు పెట్టి అసైన్‌మెంట్ జాబితాను ఆమోదించారు. ఈ జాబితాలో అనర్హులే ఎక్కువగా ఉన్నట్లు ఆరోపణలున్నాయి. భూమి లేని నిరుపేదలకు భూపంపిణీ చేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా ప్రభుత్వ భూములను భూస్వాములైన వైసీపీ నేతలకు కట్టబెట్టినట్లు ప్రచారం ఉంది. నాడు కొందరు ఎమ్మెల్యేలు కూడా బినామీల పేర్ల మీద వందల ఎకరాలను అసైన్‌మెంట్ రూపంలో కొట్టేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. చాలా గ్రామాల అసైన్‌మెంట్ జాబితాలు ఆర్డీవో కార్యాలయాల్లో లేవని తెలుస్తోంది.

● అనర్హులకు ఫ్రీహోల్డ్ హక్కులు

ఇక అసైన్‌మెంట్ భూములకు ఫ్రీహోల్డ్ (పట్టాగా మార్పు చేయడం) హక్కులు కల్పించిన వ్యవహారంలో కూడా భారీ కుంభకోణం జరిగినట్లు సమాచారం. అసైన్‌మెంట్ పట్టా ఇచ్చి 20 సంవత్సరాలు దాటిన వారికి ఒరిజినల్ పట్టాగా మార్పు చేస్తూ గతేడాది చివర్లో ప్రభుత్వం జీవో విడుదల చేసింది. అందుకు సంబంధించి జిల్లాలో వేల ఎకరాలకు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు. కానీ ఈ వివరాలన్నింటినీ రెవెన్యూ అధికారులు ఇప్పటికీ గోప్యంగా ఉంచారు. కానీ జిల్లాలో యాభై శాతానికిపైగా అసైన్‌మెంట్ భూములు చేతులు మారిపోయాయి. ఇలా ఒరిజినల్ అసైనీదారులు భూమ్మీద లేకపోయినా వైసీపీ నాయకులు మేలు చేసేలా కొన్ని వేల ఎకరాలకు ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించినట్లు ఆరోపణలున్నాయి. ఇలా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించిన దాదాపు 500 ఎకరాలు గడిచిన ఆరు నెలల్లో రిజిస్ట్రేషన్లు కూడా జరిగిపోయాయి. ఈ జాబితాపై కూడా విచారణ జరిపితే అనేక వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయి.

● చుక్కల భూముల పేరుతో...

నిషేధిత జాబితాలో ఉన్న కొన్ని వేల ఎకరాల భూములను ఆ జాబితా నుంచి అధికారులు తొలగించారు. 2023, జనవరిలో ఒకే జీవోతో దాదాపు 40 వేల ఎకరాలను ఆ జాబితా నుంచి తీసేశారు. అంతకుముందే జిల్లా ఉన్నతాధికారులు వేల ఎకరాలను 22-ఏ జాబితా నుంచి తప్పించారు. ఈ వ్యవహారంలో కూడా భారీ ఎత్తున అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూములను కూడా వైసీపీ నాయకుల కోసం నిషేధిత జాబితా నుంచి తొలగించినట్లు అప్పట్లో ప్రచారం జరిగింది. ల్యాండ్ సీలింగ్‌లో ప్రభుత్వానికి అప్పగించిన భూములను కూడా ఆర్‌హెచ్‌లో పట్టాగా నమోదై ఉంది కాబట్టి దానిని 22-ఏ నుంచి తొలగించి ఆ భూములను అప్పగించిన వారసులకు మేలు చేసిన ఘటనలూ ఉన్నాయి. నెల్లూరు రూరల్ మండలం గుడిపల్లిపాడు రెవెన్యూ పరిధిలోని కోడూరుపాడులో జరిగిన ఉదంతమే ఇందుకు ఉదాహరణ. ఇక ప్రభుత్వ భూములు, కాలువ భూములు, సర్కారు తోపు, తోపు పోరంబోకు భూములను కూడా 1954కు ముందు పట్టాలు ఇచ్చినట్లుగా చూపిస్తూ వాటికి ఎన్‌వోసీలు జారీ చేసిన ఘటనలూ జిల్లాలో ఉన్నాయి. వీటన్నింటిపై లోతుగా విచారణ జరిపిస్తే అనేక అక్రమ భాగోతాలు బయటకు వస్తాయి. ఇవన్నీ జరగాలంటే ఆ రికార్డులు రెవెన్యూ కార్యాలయాల్లో భద్రంగా ఉండాల్సిన అవసరముంది.

నాడు సివిల్ సప్లయీస్ కార్యాలయం..

నెల్లూరు(హరనాథపురం) : పరిపాలనా సౌలభ్యం కోసం కలెక్టరేట్‌లో సివిల్ సప్లయిస్ డీఎం, డీఎస్‌ఓ కార్యాలయాలు ఉండేవి. అయితే, 2013, నవంబరు ప్రాంతంలో కార్యాలయాలు తగలబడిపోయాయి. అందులోని ఫైళ్లు బూడిద అయ్యాయి. ఈ ఘటనకు విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అని అప్పటి అధికారులు తెలిపారు. అయితే, ఆనాడు సివిల్ సప్లయిస్ ద్వారా భారీగా ధాన్యం కొనుగోళ్లు రూ.కోట్లలో జరిగాయి. అధికారులకు కూడా బాగా ముట్టినట్లు ప్రచారం నడిచింది. ధాన్యం కొనుగోళ్లు, అక్రమ సంపాదన వెనుక వ్యవహారం బయటకు పొక్కింది. దీంతో ఉన్నతస్థాయిలో విచారణ జరిగుతుందనే ప్రచారం విస్తృతంగా నడిచింది. దొంగ లెక్కలు బయట పడతాయనే అనుమానంతో ఆ కార్యాలయాన్ని ఆనాడు తగలబెట్టారనే ఆరోపణలు గుప్పుమన్నాయి. ఒక్క ఫైలు కూడా దక్కించుకోలేకపోయారు. దీనివెనుక సూత్రధారులు, పాత్రధారులు ఎవరో ఇప్పటికీ తేల్చలేదు. అయితే, సివిల్ సప్లయిస్ డీఎం కార్యాలయానికి ఆనాటి నుంచి సొంత భవనం లేకుండా పోయింది. అద్దెభవంతిలోనే కాలం వెళ్లదీస్తున్నారు.



అద్దె భవనంలో నడుస్తున్న సివిల్ సప్లయీస్ కార్యాలయం

వచ్చే నెల 10 వరకు పంచాయతీల్లో
ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు : డీపీవో

నెల్లూరు (జడ్పీ), జూలై 25 : జిల్లాలో వర్షాలు కురుస్తుండటంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గురువారం నుంచి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీపీవో సుస్మితారెడ్డి తెలిపారు. గురువారం తన చాంబర్‌లో ఆమె అధికారులతో సమావేశమై మాట్లాడారు. కలెక్టరు ఆదేశాల మేరకు వచ్చే నెల 10 వరకు పంచాయతీలలో ఈ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పించడంతోపాటు పారిశుధ్యం మెరుగు పరిచి కలుషిత నీరు అరికట్టడం వంటి పనులను చేపట్టాలన్నారు. ఎక్కడైన విషజ్వరాలు అధికంగా ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 9100121702కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

● వాంతులు, విరేచనాలతో మహిళ మృతి?

అనంతసాగరం : బొమ్మవరం ఎస్సీ కాలనీకి చెందిన పల్లవోలు బుజ్జమ్మ (31) వాంతులు, విరేచనాలతో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గురువారం గ్రామంలో జరిగిన గ్రామసభలో ఈ విషయాన్ని అధికారులకు తెలియజేశారు. పారిశుధ్య లోపం, వైద్యసిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించక పోవడంతోనే డయేరియా సోకుతున్నట్లు ఎంపీడీవో తాజ్‌మస్రూర్‌కు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకొన్న అనంతసాగరం పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి గ్రామానికి చేరుకొని బుజ్జమ్మ మృతిపై విచారించారు.

'బూడిద' సమస్యకు శాశ్వత పరిష్కారం లేదా!?

- తరచూ పైపులైన్ల లీకేజీతో వెదజల్లుతున్న కాలుష్యం
- పంటలకు తీవ్ర నష్టం.. రొయ్యల చెరువులూ కలుషితం
- రైతుల గోడు పట్టించుకోని జెన్‌కో అధికారులు

ముత్తుకూరు, జూలై 25 : శ్రీ దామోదరం సంజీ వయ్య థర్మల్ విద్యుత్ కేంద్రం (జెన్‌కో) యాష్ పాండ్ పైపులైన్ల లీకేజీతో కాలుష్యం వెదజల్లుతోంది. పదే పదే థర్మల్ కేంద్రం నుంచి బూడిద చెరువులకు వెళ్లే పైపులైన్లు లీకేజీ కారణంగా పరిసర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతు న్నారు. సమస్య ఏర్పడినప్పుడు జెన్‌కో అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేసి సరిపెట్టేస్తున్నారు. దీంతో కొద్దిరోజుల్లో మళ్లీ పైపులైన్లు యథాప్రకారం లీకేజీ అవుతున్నాయి. ఈ పైపుల నుంచి వచ్చే బూడిద నీరు చుట్టుపక్కల పంట పొలాల్లో చేరి తీవ్ర నష్టం కలగజేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొయ్యల చెరువుల్లోనూ బూడిద నీరు ప్రవహించడంతో నీరు కలుషితమై రొయ్యలు చనిపోతున్నాయి. జెన్‌కో అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాము పంటలను నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గడిచిన 4 నెలల కాలంలో యాష్ పాండ్ పైపులైన్లు ఐదుసార్లు లీకేజీ అయ్యాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. గతంలో జెన్‌కో సీఈ రైతులతో మాట్లాడుతూ పైపులైన్లకు శాశ్వత మరమ్మతులు చేయించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. కానీ ఆ హామీ ఇచ్చిన వారంలోపే యథాప్రకారం పైపులైన్ల లీకేజీతో బూడిద నీరంతా రోడ్లపై ప్రవహించింది. యాష్‌పాండ్ బూడిదతో నిండిపోయి ఇప్పటికే పరిసర గ్రామాల్లో సమస్యలు తలెత్తుతుండగా, ఈ లీకేజీ సమస్య మరింత భారంగా మారింది. ఇప్పటికైనా జెన్‌కో అధికారులు స్పందించి తక్షణం యాస్ పాండ్ పైపులైన్లకు పూర్తిస్థాయిలో మరమ్మతు చేసి లీకేజీ లేకుండా చూడాలని పరిసర గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.





పైపులైన్ లీకేజీతో బయటకు వచ్చిన బూడిద నీరు

కమిషనర్ సంతకం ఫోర్జరీ కేసులో
పోలీసుల విచారణ వేగవంతం

- రంగంలోకి మూడు ప్రత్యేక బృందాలు
- కార్పొరేషన్ కార్యాలయంలో ఫైళ్లు పరిశీలించిన డీఎస్పీ



నెల్లూరు (క్రైం), జూలై 25 : నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ సంతకాల ఫోర్జరీ కేసులో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. నగర డీఎస్పీ శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈ కేసులో ఆరుగురిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకునేందుకు చెన్నై, బెంగళూరు తదితర ప్రాంతాల్లో గాలిస్తున్నారు. మరోవైపు ఈ కేసులో ఆరుగురితోపాటు మరికొందరి ప్రమేయం ఉందన్న అంశంపై పోలీసుల విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో నగర డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం పలు ఫైళ్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నగర డీఎస్పీ మాట్లాడుతూ అప్పటి కమిషనర్ వికాస్ మర్మత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారిస్తున్నట్లు తెలిపారు.

బీట్ ఆఫీసర్ సస్పెన్షన్

మర్రిపాడు, జూలై 25 : ఎర్రచందనం దుంగల తరలింపులో పట్టుబడ్డ బీట్ ఆఫీసర్‌పై వేటు పడింది. కదిరినాయుడుపల్లి బీట్ ఆఫీసర్ సంపత్‌కుమార్‌ను గురువారం డీఆర్వో చంద్రశేఖర్ సస్పెండ్ చేశారు. ఇటీవల ఎర్రచందనం అక్రమంగా రవాణా చేస్తూ టాస్క్‌ఫోర్స్ అధికారులకు దొరికిన వారితో తమ శాఖకు ఎటువంటి సంబంధం లేదని, వారిలో రసూల్, పెంచల ప్రసాద్ గతంలో బేస్‌క్యాంప్‌లో పని చేస్తుండగా వారితోపాటు మరో ముగ్గురిని ఈ ఏడాది జూలై 1వ తేదీన విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

విద్యుత్ అక్రమాలపై కఠిన చర్యలు : ఎస్ఈ

నెల్లూరు (జడ్పీ), జూలై 25 : జిల్లాలో విద్యుత్ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ హెచ్చరించారు. గురువారం ఆయన టెలీకాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగలు దొంగలించినా, మీటర్లు లేకుండా విద్యుత్ చౌర్యానికి పాల్పడినా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమాలను అరికట్టేందుకు ప్రత్యేక అధికారులుగా ఏపీటీఎస్ సీఐలుగా శ్రీనివాసులురెడ్డి, 9440811787, పీవీ సుబ్బారావు 9490615816 నెంబర్లకి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

సైజు చూస్తే
గుడ్లు తేలేయాల్సిందే!

● అంగన్‌వాడీలకు చిన్నసైజు, కుళ్లిన ఎగ్స్ సరఫరా ● చిన్నపిల్లలు, బాలింతల ఆరోగ్యంతో చెలగాటం

నెల్లూరు (హరనాథపురం), జూలై 25 : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లు చిన్నవిగాను, కుళ్లినవి సరఫరా చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలలో పోషక విలువలు బాగుండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలకు గుడ్లు సరఫరా చేయిస్తోంది. అయితే, సరఫరా బాధ్యతలు తీసుకున్న కాంట్రాక్టరు ముందుగా చేసుకున్న ఒప్పందాలను కాలరాసి ఇష్టానుజారం గుడ్లు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా నెలకు 24 నుంచి 26 చొప్పున నెలలో రెండుసార్లు కోడిగుడ్లు ఇస్తారు. వీటిని రెండు దఫాలుగా అందచేయడం వల్ల గుడ్లను తీసుకెళ్లిన వారు చిన్నవి ఇచ్చారని, నల్లగా మారిన గుడ్లు ఇచ్చారని అంగన్‌వాడీ కార్యకర్తలకు వాపసు చేస్తున్న సంఘటనలు, వారితో వాదులాటకు దిగుతున్న సంఘటనలు జిల్లాలో పెరుగుతున్నాయి.

● ట్రేకు 30 కోడిగుడ్లు

అంగన్వాడీ కేంద్రాలకు ఇచ్చే ట్రేలో 30 గుడ్లు పడతాయి. ఆ ట్రే బరువు 1500 గ్రాములు ఉండాలి. ఒక గుడ్డు బరువు 50 గ్రాములకు మించి ఉండాలి. అయితే, ఒక్కో గుడ్డు 30 గ్రాముల బరువు కూడా ఉండటం లేదని గర్భిణులు, బాలింతలు వాపోతున్నారు. అంతేగాక నల్లగా మారిన గుడ్లను ఇస్తున్నట్లు ఆరోపించారు. ఈ గుడ్లను తింటే పోషకాహారం మాట అటుంచి ఆసుపత్రి పాలవుతామని వాపోయారు. అయితే, అధికారులు మాత్రం చిన్న, పెద్ద గుడ్లు అని కాకుండా ట్రేలో గుడ్ల బరువు 1500 గ్రాములు ఉంటే చాలన్నారు. బరువు విషయంలో పొంతనలేని సమాధానం ఇస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి బరువు కలిగిన, నాణ్యత ఉన్న గుడ్లు పంపిణీ చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బాలింతలు కోరుతున్నారు.



అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా అయిన చిన్న సైజు కోడిగుడ్లు

ఒప్పందం ప్రకారం సరఫరా ఉండాలి

ఒప్పందం ప్రకారం కాంట్రాక్టరు కోడిగుడ్లను సరఫరా చేయాలి. అందుకు ఐసీడీఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలి. ట్రే బరువుతోపాటు గుడ్డుబరువు కూడా 50 గ్రాములకు మించి ఉండేలా చూడాలి ఐసీడీఎస్ అధికారులు నిత్యం తనిఖీలు నిర్వహించి గుడ్ల నాణ్యత, సైజు, పరిమాణం సరిగా ఉన్నాయా లేవా అని చూడాలి. కాంట్రాక్టరు కూడా ఒప్పందం ప్రకారం కోడిగుడ్లు సరఫరా చేయాలి.

- సునీత, రెహనాబేగం, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ల సంఘం నేతలు

తనిఖీలు నిర్వహిస్తాం

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న గుడ్లను తనిఖీ చేస్తాం. నాణ్యతతోపాటు, గుడ్డు 50 గ్రాముల బరువు ఉందా లేదా అనే విషయం చూస్తాము. చిన్నగుడ్లు సరఫరా అవుతున్నట్టు తెలిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

- హేనా సుజన్, ఐసీడీఎస్ పీడీ

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు
దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య), జూలై 25 : పాలిసెట్-2024 స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.రామ్‌ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 31వ తేదీన డిప్లొమో కోర్సుల్లో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు టెన్త్ మార్కుల జాబితా, టీసీ, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రంతోపాటు పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు, ఈడబ్ల్యూఎస్ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. అలాగే పాలిసెట్-24 ప్రవేశపరీక్షలో ర్యాంకు సాధించిన విద్యార్థుల్లో బీసీ, ఓసీలు రూ.700, ఎస్సీ, ఎస్టీలు రూ.250 చెల్లించాలన్నారు. అలాగే అర్హత సాధించిన విద్యార్థుల్లో ఓసీ, బీసీలు రూ.1100, ఎస్సీ, ఎస్టీలు రూ.350 ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలన్నారు. అనంతరం సీటు పొందిన విద్యార్థి ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు జెరాక్స్ కాపీలతోపాటు రూ.4,700 కళాశాల ఫీజును వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు ఎలాంటి స్కాలర్‌షిప్ రాదని తెలిపారు.

● రేపు ఐటీఐ కళాశాలలో ఎంపికలు

జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో చేరదలచుకున్న విద్యార్థులకు ఈ నెల 27న ఎంపికలు నిర్వహిస్తామని వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐ ప్రిన్సిపాల్ కె.శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని ఉదయం 9 గంటలకు తమ కళాశాలలో హాజరుకావాలని పేర్కొన్నారు.

ధాన్యం నగదు కోసం రైతుల ధర్నా



కలెక్టరేట్‌లో ధర్నా చేస్తున్న రైతులు

నెల్లూరు (హరనాథ పురం), జూలై 25 : తాము ఇచ్చిన ధాన్యానికి నగదు ఇప్పించాలని కోరుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల రైతులు కలెక్టరేట్ ఎదుట గురువారం ధర్నా చేశారు. నెల్లూరు శివారులోని కొత్తకాలువకు చెందిన సాయిబాబా రైస్ మిల్లు యజ మాని శ్రీరాం శేఖర్‌బాబు తమను నమ్మించి మోసం చేశాడని టీపీ గూడూరుకు చెందిన టీ వెంకటేష్‌కుమార్, జంగాలపల్లికి చెందిన డీ. సుబ్బారావు, చింతోపునకు చెందిన వీ భరత్, కోడూరుకు చెందిన మస్తానయ్య, సర్వేపల్లికి చెందిన రమణయ్య, గూడూరుకు చెందిన షబ్బీర్ బాషా, అల్లూరుకు చెందిన కే కృష్ణ తదితర రైతులు ఆరోపించారు. ఆ మిల్లు యజమానికి ధాన్యం ఇస్తే నగదు ఇవ్వలేదని చెప్పారు. ఆయన చేసిన మోసం వలన 434 మంది రైతు కుటుంబాలు వీధిన పడ్డాయని వివరించారు. జిల్లాలోని రైతులకు ఆయన సుమారు రూ. 4.66 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు ఇవ్వలేద న్నారు. దీంతో కలెక్టర్‌గా పనిచేసిన హరినారాయణన్‌కు, ప్రస్తుత కలెక్టర్ ఆనంద్‌కు విషయం తెలియచేసి, తమ డబ్బు తమకు వచ్చేలా చేయమని కోరామన్నారు. వారు రైస్‌మిల్లర్ల సంఘ నాయకులకు కూడా చెప్పారని, అయినా ఫలితం లేకపోవటంతో ధర్నా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కే కృష్ణ, ఈ. రాజేంద్ర, కే. రమణయ్య, కే. గంగయ్య, ఎం.కోటారెడ్డి, దాసరి మదుసూధన్, పీ గణేష్, సిహెచ్ మాధవ్ తదితర రైతులు పాల్గొన్నారు.

హక్కు పత్రాలు నమోదు చేసుకోవాలి

నెల్లూరురూరల్, జూలై 25 : కౌలు రైతులు పంట సాగు హక్కు పత్రాలను స్థానిక వీఆర్వోల వద్ద నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి తెలిపారు. గురువారం మండలంలోని దేవరపాళెంలో కౌలు రైతులతో మాట్లాడారు. వారందరికీ ఏపీ పంటల సాగు హక్కు చట్టం గురించి వివరించారు. అనంతరం అర్హతక లిగిన వారికి పత్రాలు అందచేశారు. ఈ కార్యక్ర మంలో ఏడీ ఎస్ శ్రీనివాసులు, ఏవో నాగమోహ న్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మనుబోలు, జూలై 25: మండల పరిధిలోని జాతీయ రహదారిపై యాచవరం రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. యాచవరంకు చెందిన కుడుముల సురేంద్రబాబు ఆదిశంకర కళాశాలలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో విధులు ముగించుకుని సురేంద్రబాబు యాచ వరం వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా నెల్లూరు నుంచి మోటార్‌సైకిల్‌పై వెళ్తున్న గోపికృష్ణ సురేంద్రబాబును వేగంగా ఢీకొట్టాడు. దీంతో బాబుతో పాటు, గోపికృష్ణకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరూ నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

గురుకులాల్లో టీచర్ పోస్టుల భర్తీ

● అర్హులు దరఖాస్తు చేసుకోండి : హేమలత

నెల్లూరు(హరనాథపురం), జూలై 25: జిల్లాలోని అంబేడ్కర్ గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన పార్ట్‌టైం టీచర్ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ జిల్లా సమన్వయ అధికారి టీ హేమలత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులయినవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 29న కొత్త కోడూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో డెమోద్వారా తాత్కాలిక ప్రాతిపదికన ఈ పోస్టులు భర్తీ చేస్తామన్నారు. బుచ్చి గురుకులంలో జేఎల్ ఫిజిక్స్ పీజీటీ సోషల్, పెదపవనిలో జేఎల్ కెమిస్ట్రీ , టీజీటీ బయాలజికల్ సైన్స్ పోస్టులు ఖాళీ ఉన్నాయని తెలిపారు. కోడూరులో టీజీటీ ఇంగ్లీషు, టీజీటీ ఫిజికల్ సైన్సు కందలేరులో పీజీటీ మ్యాథ్స్, టీజీటీ పిజికల్ సైన్సు, ఆదూరుపల్లిలో టీజీటీ బయాలజికల్ సైన్సు పోస్టు ఖాళీగా ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు ఆంగ్ల మాధ్యమంలో బోధించడానికి ఈ నెల 29న ఉదయం 10 గంటలకు కొత్తకోడూరు పాఠశాలకు ఒరిజినల్ సర్టి ఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ, బీఈడీలతోపాటు మోథ డాలజీ సబ్జెక్టుతో టెట్ ఉత్తీర్ణలై ఉండాలన్నారు. కులధ్రువీకరణ సర్టిఫికెట్ కూడా తీసుకొని రావాలని వివరించారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

నెల్లూరు(క్రైం), జూలై 25: ఎనిమిదేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై వేదాయపాలెం పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు, నగరంలోని ఓ ప్రాంతానికి చెందిన ఎనిమిదేళ్ల చిన్నారికి వరుసకు మామ, అతడి స్నేహితుడు కలిసి మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డారు. చిన్నారి ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని కుటుంబసభ్యులకు తెలపడంతో వారు వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పార్థు, సంతోష్‌లపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నగోపవరంలో
ఉపాధి అవినీతి రూ.30లక్షల పైమాటే!


- మరో ఆరు పంచాయతీల్లో కూడా భారీగా అవినీతి
- నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక



చిన్నగోపవరంలో జరిగిన సామాజిక తనిఖీ గ్రామసభ

కలువాయి, జూలై 25 : మండలంలోని చిన్న గోపవరంలో ఉపాధి అక్ర మాలు తవ్వే కొద్ది బయట పడుతున్నాయి. ఇటీవల ఉపాధి అం బూడ్స్ పర్సన్ జరిపిన విచారణలో భారీగా అక్రమాలు, అవినీతి వెలుగులోకి వచ్చాయి. రెండు రోజులుగా చేసిన సోషల్ ఆడిట్‌లో రూ.30లక్షలు పైగానే అవినీతి జరిగినట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతరుల జాబ్‌కార్డులలో గ్రామానికి సంబంధంలేని వారి పేర్లు భారీ సంఖ్యలో చేర్పించారు. దీంతో పేర్లు 150పైగానే ఉన్నట్లు బృందాలు గుర్తించాయి. వారంతా ఉపాధి పనులకు వెళ్తున్నట్లు బోగస్ మస్టర్లు వేసి నిధులు స్వాహా చేశారు. ఇలా స్వాహా చేసిన మొత్తం రూ.30లక్షలకు పైమాటే. సోషల్ ఆడిట్‌పై గురువారం చిన్నగోపవరంలో తనిఖీ బృందాలు గ్రామసభ నిర్వహించారు. బోగస్ మస్టర్లతో రూ.30లక్షలు అవినీతి జరిగినట్లు నిర్ధారణ అయినా కేవలం రూ.10లక్షల మేర తేడా ఉన్నట్లు సమాచారం. మిగిలిన రూ.20లక్షలు ఏమయ్యాయనేది ప్రశ్నార్థకంగా మారింది. చిన్నగోపవరంతో పాటు మరో ఆరు పంచాయతీల్లో కూడా భారీగా అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నట్లు సమాచారం. అలాగే సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక శుక్రవారం ఉదయం 10గంటలకు మండల పరిషత్తు కార్యాలయంలో జరగనుంది. ఈ వేదికలో తనిఖీ బృందాలు గుర్తించిన అవకతవకలను బహిరంగంగా ఉన్నాతాధికారులకు తెలియజేయనున్నారు.

సెల్‌ఫోన్ దొంగిలించాడని దాడి



గాయాలపాలైన మహేంద్ర

కొండాపురం, జూలై 25: సెల్‌ఫోన్ దొంగిలించాడంటూ దాడిచేసి వ్యక్తిని గాయపరచిన ఘటనపై పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు వెలి గండ్ల గ్రామానికి చెందిన పూల మహేంద్రను సెల్‌ఫోను దొంగిలించాడంటూ అదే గ్రామానికి చెందిన పుప్పాల శ్రీనివాసులు, కుమారుడు బాలాజీ బుధవారం రాత్రి కర్రలతో దాడిచేయగా గాయాలపాలయ్యాడన్నారు. కుటుంబ సభ్యులు మహేంద్రను కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. దాడికి పాల్పడిన శ్రీనివాసులు, బాలాజీలపై కేసు నమోదుచేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రమేష్‌కుమార్ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	127
లేయర్ లైవ్	100
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	254
లేయర్	170

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6551
వెండి కిలో ధర	రూ. 84,100
వెండి ఒక గ్రాము	రూ. 86.10

మెట్టకు మణిహారం.. ఈ రాజమార్గం!

- జోరుగా జాతీయ రహదారి (167-బీజీ) పనులు
- సాకారమవుతున్న పశ్చిమవాసుల స్వప్నం

ఎన్నో ఏళ్ల స్వప్నం సాకారమవుతోంది. దుత్తలూరు నుంచి ఉదయగిరి మీదుగా సీతారామపురం వరకు 36.4 కిలోమీటర్ల మేర రూ.310 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న జాతీయ రహదారి (167-బీజీ) పనులు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే 55 శాతం పనులు పూర్తి చేశారు. త్వరితగతిన పనులు పూర్తయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.



దుత్తలూరు-ఉదయగిరి మధ్య పూర్తయిన జాతీయ రహదారి నిర్మాణం



దుత్తలూరు వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన

ఉదయగిరి రూరల్, జూలై 25 : మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గానికి 167-బీజీ జాతీయ రహదారి నిర్మాణం మణిహారంలా మారనుంది. తొలి విడతలో రూ.430 కోట్లతో కావలి-దుత్తలూరు మార్గం పనులు చేపట్టారు. మలివిడతలో రూ.310 కోట్లతో దుత్తలూరు-ఉదయగిరి-సీతారామపురం మార్గంలో మూడు లైన్ల రహదారి (పది మీటర్లు) నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఉదయగిరి-సీతారామపురం మధ్య రహదారి పనులు 55 శాతం పూర్తయ్యాయి. పలుచోట్ల వంతెనల నిర్మాణం జరుగుతోంది. సీతారామపురం మండలం సింగారెడ్డిపల్లి, దుత్తలూరు సెంటర్‌లో ఫ్లైవర్ పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసు కొంటున్నారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండ నుంచి సీతారామపురం మీదుగా కడప జిల్లా మైదుకూరు వరకు 167-బీ జాతీయ రహదారి నిర్మాణ పనులు సైతం జోరుగా సాగుతు న్నాయి. దీంతోపాటు 167-బీజీ జాతీయ రహదారి పనులు పూర్తయితే కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, బెంగళూరు, హైదరాబాదు వంటి ప్రాంతాలకు వెళ్లేందుకు సులువవుతుంది.

● అభివృద్ధికి మార్గాలు

రహదారుల నిర్మాణం అభివృద్ధికి మార్గాలు. రాకపోకలతోపాటు వృత్తి వ్యాపారాల అభివృద్ధికి అవి ఎంతగానో దోహదపడతాయి. అందుకు ఉదాహరణే 167-బీజీ జాతీయ రహదారి నిర్మాణం. ఈ రహదారి నిర్మాణంతో మెట్ట భూముల ధరలకు రెక్కలొచ్చాయి. గతంలో రహదారికి సమీపంలో ఉన్న ఎకరా భూమి రూ.5 లక్షల నుంచి 7 లక్షలు పలుకుతుండేది. ప్రస్తుతం రోడ్డు నిర్మాణంతో ప్రాంతాన్ని బట్టి రూ.25 లక్షల నుంచి 30 లక్షలు పలుకుతోంది. వింజమూరు, దుత్తలూరు, కలిగిరి ప్రాంతాల్లో రహ దారి పక్కనే భారీ లేఅవుట్లు వేసి ప్లాట్ల విక్రయాలకు సైతం సిద్ధమవుతున్నారు. రామాయపట్నం పోర్టు పూర్తయితే ఈ మార్గం రద్దీగా మారడంతోపాటు ధరలు పెరుగుతాయన్న నెపంతో కొందరి నేతల చూపు భూముల కొను గోళ్లపై పడింది. ఏదిఏమైనా జాతీయ రహదారి నిర్మాణంతో మెట్ట ప్రజల స్వప్నం సాకారం కానుంది.

55 శాతం పనులు పూర్తి

ఉదయగిరి-సీతారామపురం జాతీయ రహదారి (167-బీజీ) నిర్మాణ పనులు 55 శాతం పూర్తయ్యాయి. ప్రస్తుతం దుత్తలూరు సెంటర్‌లో ఫ్లైఓవర్, సింగారెడ్డిపల్లి వద్ద రహదారి నిర్మాణం జరుగుతోంది. కాంట్రాక్టరు జోరుగా పనులు సాగిస్తున్నారు.

- సుమన్, హైవే ఏఈఈ

సోమశిలలో 9.645 టీఎంసీల నీటి నిల్వ

అనంతసాగరం, జూలై 25: సోమశిల ప్రాజెక్టు పూర్తి సామ ర్థ్యం 77.988 టీఎంసీలు కాగా గురువారం నాటికి 9.645 టీఎం సీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారు లు తెలిపారు. దిగువ డెల్టాకు 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఆదాయం వస్తేనే
ఖర్చు చేయగలం..!

- మొండి బకాయిలపైనే దృష్టంతా..
- తొలి సమీక్షలో కమిషనర్ సూర్యతేజ



సమీక్షలో మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(సిటీ), జూలై 25 : నగర పాలక సంస్థ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలంటే అందుకు తగ్గట్టు ఖర్చు పెట్టాలి. ఇదంతా జరగాలంటే ఆదాయం ఉండాలని ఎన్ఎంసీ కమిషనర్ మల్లవరపు సూర్యతేజ అన్నారు. బాధ్యతలు స్వీకరించాక గురువారం రెవెన్యూ, ఇంజనీరింగ్ అధికారులతో తొలి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్ఎంసీ ఖజానాకు ఆదాయ మార్గాలను అన్వేషించాలన్నారు. బడా పన్నుదారుల జాబితా తయారు చేసి, వారినుంచి పన్నులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొండి బకాయిదారుల నుంచి పూర్తిగా వసూళ్లు చేయాలన్నారు. కాగా కమిషనర్‌ను డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, మరికొందరు కార్పొరేటర్లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కొడవలూరు, జూలై 25 : మండలంలో నార్తురాజుపాళెం గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతదేహం సమీపంలో విషగుళికలు ఉన్నాయని, మృతుడి వయస్సు సుమారు 65 సంవత్సరాలు ఉంటుందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు, మృతుడి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోండి

వెంకటాచలం, జూలై 25 : నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ మండలాధ్యక్షుడు నలబాలపు వెంకటాద్రి కోరారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో గురువారం టీఎన్ఎస్ఎఫ్ నేతలు వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో చైతన్యభారతి డిగ్రీ కళాశాలతో పాటు పీజీ, బీఈడీ కళాశాలలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయన్నారు. వీటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీఎన్ఎస్ఎఫ్ నేతలు ప్రసాద్, అశోక్ ఉన్నారు.

డ్రైవర్‌ను కాపాడిన పోలీసులు

మనుబోలు, జూలై 25: రోడ్డు ప్రమాదంలో అస్వస్థత కు గురైన లారీడ్రైవర్‌ను పోలీసులు కాపాడారు.ఈ సంఘటన బుధవారం అర్ధరాత్రి వీరంపల్లిలో చోటుచేసుకుంది. పొదలకూరు నుంచి జామాయిల్ కర్ర లోడుతో చెన్నై వెళ్తున్న లారీ వీరంపల్లి వద్ద అదుపుతప్పి తాటిచెట్లను ఢీకొని బోల్తా పడింది. ఆ సమయంలో అటుగా వెళ్తున్న ఓ ప్రయాణికుడు పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే ఎస్‌ఐ అజయ్‌కుమార్ స్పందించి సిబ్బందిని పంపారు. లారీలో ఇరుక్కుని డ్రైవర్ గోపికుమార్‌ను పీసీ ఇస్మాయిల్, హోంగార్డు అరుణ్‌కుమార్ చాకచక్యంగా బయటకు తీసి చికిత్స నిమిత్తం 108లో గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఖాళీలు చూపకుండా ఉద్యోగాల నుంచి తొలగించవద్దు



డీఎంహెచ్‌వోకి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

నెల్లూరు (వైద్యం) జూలై 25: ఖాళీలు చూపకుండా ఉద్యోగాల నుంచి తొలగించవద్దని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్యను కోరారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద వారు ఆందోళన చేసి, అనంతరం వినతి పత్రం ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న 26 మంది నేషనల్ హెల్త్‌మిషన్ స్టాఫ్‌నర్సులను, ఇతర ఉద్యోగులను తొలగించరాదని యూనియన్ గౌరవాధ్యక్షుడు సతీష్‌కుమార్ కోరారు. 15 ఏళ్ల పనిచేసిన కాంట్రాక్టు ఉద్యోగులను సహృదయంతో ఆదుకోవాలని కోరారు. ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ అధికారి గత నెల 18న ఆయా ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారన్నారు. జిల్లాలో ఖాళీగా ఉన్న కాంట్రాక్టు ఉద్యోగాల్లో వీరికి అవకాశం కల్పించాలని, లేదంటే తొలగించాలని ఆయా ఉత్తర్వుల్లో పేర్కొన్నారన్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఐదు ఖాళీలు మాత్రమే ఉన్నాయని, మిగిలిన వారికి కూడా అవకాశం కల్పించాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి సంధానీబాషా, బాధిత కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రమాదంలో కనిగిరి రిజర్వాయర్

- అరణ్యాన్ని తలపిస్తున్న ఆయకట్టు
- పలుచోట్ల పగుళ్లు, గండ్లు
- మరమ్మతులు చేయాలని రైతుల వేడుకోలు

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 25 : సుమారు 18వేల ఎకరాల్లో 6 టింఎంసీల నీటి సామర్థ్యం కలిగిన కనిగిరి రిజర్వాయర్‌కు ప్రమాదం పొంచి ఉందా అంటే ఔననే చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది. వవ్వేరు గ్రామం వద్ద ఈస్ట్రన్ (తూర్పు కాలువ) చానల్ సమీపం నుంచి గిరిజన కాలనీ దాకా రిజర్వాయర్ ఆయకట్టుకు లోతట్టున పలుచోట్ల ఏర్పడివున్న గండ్లు ఆందోళన రేకెత్తిస్తోంది. అదేవిధంగా ముంబయి కలుజులు, సదరన్ ఛానల్ నుంచి సిద్దీపురం వద్ద పెన్నానది నుంచి రిజర్వాయర్‌కు సాగునీరు పారుదలయ్యే కనిగిరి (ర్యాంపు) కాలువ దాకా సుమారు 9 కి.మీ పొడవున భారీ వృక్షాలు, ముళ్లపొదలు దర్శనమిస్తున్నాయి. మరోవైపు రిజర్వాయర్‌లో అలల ఉధృతికి ఆయకట్టుకు లోతట్టు ప్రాంతంలో రివిట్‌మెంట్‌కు పలుచోట్ల పగళ్లిచ్చి, బండలుతోసహా గండ్లు ఏర్పడ్డాయి. ఆర్నెళ్లుగా రిజర్వాయర్‌లో అంచెలంచెలుగా నీటిమట్టం తగ్గిపోయి ప్రస్తుతం చెరువంతా ఎండిపోయి ఈస్ట్రన్, ఫైడేరు ఛానళ్ళ సమీప ప్రాంతంలో మోకాలి లోతున నీరుంది.



రిజర్వాయర్ కరకట్టకు లోతట్టు రివిట్‌మెంట్‌కు ఏర్పడిన గండ్లు

రిజర్వాయర్‌కు ప్రమాదం తప్పించాలని బాబురావు అనే స్థానిక రైతు ఎంపీ, ఎమ్మెల్యే వేమిరెడ్డి దంపతులు, ఇరిగేషన్ అధికారులకు విన్నవించిన వెంటనే చర్యలకు ఆదేశించినట్లు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో సుమారు 7వేల ఎకరాలకు పైగా ఆక్రమణకు గురికాగా 3.5 టీఎంసీలకు పరిమితమైంది. అందులోనూ ఒక టీఎంసీకి పైగా పూడికతో వుంది. దీంతో కనిగిరి రిజర్వాయర్ 2టీఎంసీల వరకే సాగు జలాలకు అనుమతిస్తుండగా అర టీఎంసీ మూగజీవాల కోసం కేటాయిస్తున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈఈ మదును వివరణ కోరగా ఎస్ఈ, ఈఈ ఆదేశాల మేరకు కొత్త ఎస్ఎస్ఆర్ ప్రకారం అంచనాలు తయారుచేసి పంపించనున్నట్లు తెలిపారు.



కనిగిరి రిజర్వాయర్ ముంబయి కలుజులు

గండ్లను పూడ్చి రిజర్వాయర్‌ను కాపాడాలి



ప్రధానంగా వవ్వేరు వద్ద ఆయకట్టుకు ఏర్పడిన గండ్లతో పాటు సదరన్‌ఛానల్ నుంచి సిద్దీపురం కాలువ దాకా ఆయకట్టు (కరకట్ట) పొడవునా ఏర్పడిన పలు గండ్లకు మరమ్మతులు చేపట్టి రిజర్వాయర్‌ను కాపాడాలి. లేకుంటే భారీగా వర్షాలు, వరదలు సంభవిస్తే ఆ గండ్లు తెగే అవకాశాలు ఉన్నాయి. కనిగిరి రిజర్వాయర్‌లో యంత్రాల ద్వారా కొండలు సైతం పగలగొట్టి, గ్రావెల్‌ను తవ్వి తరలించడంతో అక్కడ కూడా ప్రమాదం పొంచివుంది. ఏడేళ్లుగా కరకట్టలకు జంగిల్ క్లియరెన్స్ చేయడం లేదు. రైతాంగం కోసం ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి.

- చిరమన ఆంజనేయులు, మాజీ సర్పంచు, వవ్వేరు

అధికారులు పట్టించుకోవడం లేదు!



కనిగిరి రిజర్వాయర్ కరకట్టలపై జంగిల్ క్లియరెన్స్, గండ్లకు మరమ్మతుల చేయాలన్న ధ్యాసే అధికారులకు లేదు. వెంటనే మరమ్మతులు చేపట్టకుంటే రిజర్వాయర్‌కు ప్రమాదం తప్పదు.

- తోనేటి శేఖరయ్య, మాజీ సర్పంచు

మరమ్మతులు చేపట్టకుంటే ప్రమాదమే



ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి వర్షాలు వచ్చేలోగా ఆయకట్టుపొడవునా లోతట్టు ప్రాతంలో ఏర్పడిన గండ్లు, పగుళ్లకు మరమ్మతులు చేపట్టాలి. లేకుంటే పెద్ద ప్రమాదాన్ని ఎదుర్కోవడంతోపాటు మండలంతోపాటు సమీప మండలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం వుంది.

- గాలం శీనయ్య, జాలరి, వవ్వేరు

'వాటర్‌బేస్' సిబ్బందిపై దాడి

తోటపల్లిగూడూరు : మండలంలోని వరకవిపూడి గ్రామ నాయకులు, వాటర్ బేస్ కంపెనీ హెచ్‌ఓడీ మధ్య గురువారం వాగ్వివాదం జరిగింది. ఇది తీవ్రరూపం దాల్చడంతో వాటర్ బేస్ సిబ్బందిపై దాడి చేశారు. హెచ్‌ఓడీ ఉత్తమకుమార్‌రెడ్డికి గాయాలు కావడంతో ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. వాటర్‌బేస్ కంపెనీ సిబ్బంది వరకవిపూడిలో కొంతసేపు నిరసన వ్యక్తం చేసి అనంతరం విధుల్లో చేరినట్లు సమాచారం.

వింజమూరులో చోరీ

వింజమూరు, జూలై 25 : పట్టణంలోని నేతాజీ స్కూల్ సమీపంలో ఉంటున్న ఉపాధ్యాయుడు మద్దూర్ చెన్నారెడ్డి ఇంట్లో బుధవారం అర్థరాత్రి చోరీ జరిగింది. అరకేజీ వెండి, రెండు జతల కమ్మలు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయం గురువారం వెలుగులోకి వచ్చింది.

ఈ నీరు తాగేదెలా!?



వాల్వ్ లీకేజీ నీటిలో సేద తీరుతున్న పశువులు

వ్యాదులు రాకుండా చేతులు బాగా శుభ్రం చేసుకోమని చెప్పే నాయకులు, అధికారులు.. ఈ చిత్రాన్ని చూసి ఏమంటారో!?. బోగోలు మండలం చెంచులక్ష్మీపురం ప్రజలకు పంచాయతీ సిబ్బంది అందించే మంచినీరు వాల్వ్ లీకేజీ కారణంగా కలుషితం అవుతున్నాయని వారు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌కు తూర్పున ఉన్న వాటర్ వాల్వ్ దెబ్బతిని చాలాకాలం అవుతున్నా పట్టించుకున్న నాథుడే లేడని వారన్నారు. నీరు నిల్వ ఉండటంతో ఆ గుంటలో పశువులు, పందులు సేదతీరుతున్నాయని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి వాల్వ్ మరమ్మతులు చేయాలని వారు కోరుతున్నారు.

- బిట్రగుంట

31న జాబ్‌మేళా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 25: జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 31న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎం. వినయ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అమేజ్ కంపెనీ తరపున చెన్నై, హైదరాబాద్‌లలో పనిచేసేందుకు వేర్‌హౌస్ అసోసియేట్ పోస్టులు 200కి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్హతలతో 18 ఏళ్ల దాటినవారు ఇంటర్వ్యూలకు హాజరు కావచ్చన్నారు. రూ.16,780 వేతనం, రూ. లక్ష మెడికల్ ఇన్సూరెన్స్, రూ.5 లక్షల యాక్సిడెంట్ ఇన్సూరెన్స్, ఉచిత ట్రాన్స్‌పోర్టు కంపెనీ నుంచి అందుతాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 31 ఉదయం 10.30 జరిగే జాబ్‌మేళాకు హాజరు కావాలని తెలిపారు.

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

అన్నివర్గాల ప్రజలకు ఆర్థిక సేవలు అందాలి



సెమినార్‌లో పాల్గొన్న యూనివర్సిటీల ప్రొఫెసర్లు

కందుకూరు, జూలై 25: స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ (ఐసీఎస్ఎస్ఆర్) ఆధ్వర్యంలో గురువారం జాతీయ సెమినార్ నిర్వహించారు. దేశంలోని వివిధ యూనివర్సిటీలలో ఆర్థికశాఖ ప్రొఫెసర్లు, పలు విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొని భారతదేశంలో ఆర్థిక సేవలు, అవకాశాలు, సమస్యలు, సవాళ్లు అనే అంశంపై చర్చించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు ఎం రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సెమినార్‌లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డి కామయ్య మాట్లాడుతూ వివిధ రకాలైన ఆర్థిక సేవలు అన్నివర్గాల ప్రజలకు అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ బి శ్రీనివాస్ ఆర్థిక కార్యకలాపాల యొక్క వివిధ దశలను వివరించారు. నూతన ఆర్థిక విధానాలు, డిజిటల్ ఇండియాలో జరుగుతున్న పరిణామాలు నేపథ్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆర్థిక కార్యకలాపాలను మరింత దగ్గర చేయాల్సిన ఆవశ్యకత, మహిళల్లో ఆర్థికాంశాల పట్ల అవగాహన పెరగాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ ఈ సెమినార్ శుక్రవారం కూడా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో డీఆర్ డీపీఎం కె కల్యాణ్, యూనియన్ బ్యాంకు ఏజీఎం కె హరిబాబు, ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వీవీ మధుసూదనరావు, దేశంలోని వివిధ యూనివర్సిటీల ప్రొఫెసర్లు డాక్టరు సీహెచ్ శంకరరావు, డాక్టరు జి. జగదీష్, కళాశాల అధ్యాపకులు ఏడుకొండలు నరేంద్ర, డాక్టరు పి. రాజగోపాల్ బాబు, డాక్టరు తిరుపతిస్వామి, డాక్టరు కె సుజాత, కేవీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

వెంగమాంబకు నెల పొంగళ్లు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

ఉదయగిరిరూరల్, జూలై 25: నర్రవాడ వెంగమాంబ పేరంటాల నెల పొంగళ్ల ఉత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అలాగే సంతానంలేని మహిళలు అమ్మవారి ఎదుట వరపడడంతో పాటు హోమగుండం వద్ద ఉన్న చెట్టుకు ముడుపులు కట్టారు. ఆలయ ఉప ప్రధాన అర్చకులు భద్రయ్య ప్రత్యేక పూజలు, కల్యాణం హోమ కార్యక్రమాలు నిర్వహించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

అనంతసాగరం, జూలై 25: స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు ముగింపు వేడుకల్లో భాగంగా గురువారం ఆలయంలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి సీతారాముల వారి కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు భానుప్రకాష్‌తో పాటు వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

అధినేతల చిత్రపటాల బహూకరణ



సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యేల చిత్ర పటాలను అందజేస్తున్న నాయకులు

సీతారామపురం, జూలై 25: జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి సింగల నాగేశ్వరరావు గురువారం స్థానిక సీతారామపురం బిట్-1, బిట్-2 సచివాలయాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్, నియోజకవర్గ శాసనసభ్యులు కాకర్ల సురేష్ చిత్రపటాలను బహూకరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, సీతారామపురం సర్పంచ్ కొడవటికంటి భాగ్యకుమారి, జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జాషువా, మండల సీనియర్ నాయకులు చెన్నకేశవులు, దేవర వెంకటేశ్వర్లు, తురక వెంకటేశ్వర్లు, మత్స్యకార అధ్యక్షుడు రాజశేఖర్, ఏడవ వార్డు నెంబర్ తోట మనోజ్, 8బూత్ ఇన్‌చార్జి తోట మాల్యాద్రి, జయరాములు, చంద్ర, పెద్దగౌస్, శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా గుర్రప్పస్వామికి పూజలు

వింజమూరు, జూలై 25: పట్టణంలోని నడిమూరులో ఉన్న గుర్రప్పస్వామి 11వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణపై హర్షం

కలిగిరి, జూలై 25: 'కలిగిరిలో ట్రాఫిక్ కష్టాలు' అని గురువారం ప్రచురితమైన 'ఆంధ్రజ్యోతి' కథనానికి పోలీసు శాఖ సత్వరమే స్పందించింది. ఇద్దరు సిబ్బందిని నియమించడంతో వారు గురువారం ఉదయం, సాయంత్రం వేళల్లో కలిగిరమ్మ కూడలి వద్ద విధులు నిర్వహించడం కనిపించింది. పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలియజేశారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు



స్కానింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు, జూలై 25: పీసీ, పీఎన్‌డీటీ చట్టం నియమ నిబంధనలకు లోబడి ఆసుపత్రిలో స్కానింగ్ కేంద్రాలు పనిచేయాలని డివిజనల్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఎస్‌వీ సుధీర్‌కుమార్ తెలిపారు. స్థానిక ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో గురువారం పీసీ, పీఎన్‌డీటీ చట్టం అమలుపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకూడదని తెలిపారు. చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం మాట్లాడారు. అనంతరం పట్టణంలోని పలు స్కానింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ఉషాసుందరీ, ఐసీపీఎస్ సూపర్‌వైజర్ ఎం రత్నమ్మ, ఏఎస్‌ఐ జే వెంకయ్య, ఎన్‌జీవో డీ రమణ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

ఆత్మకూరు, జూలై 25: ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు కృషి చేయాలని జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ సీహెచ్ ఉషారాణి తెలిపారు. స్థానిక బాలికల గురుకుల పాఠశాలలో ఆత్మకూరు డివిజన్ స్థాయిలో జరుగుతున్న సపోర్టింగ్ ఆంధ్రస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమంలో భాగంగా టీచ్ టూల్ శిక్షణా తరగతులను గురువారం ఆమె పరిశీలించారు. ఉపాధ్యాయులు తమ బోధనలో బహుళ నైపుణ్యాలను కలిగి ఉండాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన చేసి విద్యార్థులకు బోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో కే.గోపాల్, ఎంఈవో కే. చలపతి, సీఆర్పీలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాతావరణ ఆధారిత పంటల సాగుపై శిక్షణ



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ కళాశాల అసోసియేట్ ప్రిన్సిపాల్ క్రిష్ణారెడ్డి

సీతారామపురం, జూలై 25: వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ నెల్లూరు వారి ఆధ్వర్యంలో మండలంలోని అయ్యవారిపల్లిలో గురువారం వాతావరణ ఆధారిత పంటల సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉదయగిరి వ్యవసాయ కళాశాల అసోసియేట్ ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణారెడ్డి హాజరయ్యారు. క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం తిరుపతిలో ఆముదం ఐసీహెచ్-5 హైబ్రిడ్ రకం మేలైనదని, అలాగే కంది, సజ్జ గుర్తించడం జరిగిందన్నారు. పై పంటలను సాగు చేసుకొని తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శివాన్నారాయణ, మండల వ్యవసాయధికారి పీ.చెన్నారెడ్డి, మరిపాడు ఎంఏవో రామామోహన్, వీఏఏ నరేంద్ర, సర్పంచ్‌లు దుర్గాప్రసాద్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించాలి

ఉదయగిరిరూరల్, జూలై 25: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చే రోగులకు పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందేలా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా నాయకులు కాకు వెంకటయ్య అన్నారు. గురువారం నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వసతులు ఏర్పాటు చేసినప్పటికీ వైద్యుల కొరత తీవ్రంగా ఉండడంతో రోగులకు ఇక్కట్లు తప్పడం లేదన్నారు. 50 పడకల వైద్యశాలగా గుర్తింపు సాధించినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. అరకొర ఉన్న వైద్యులను సైతం డిప్యుటేషన్‌పై ఇతర ప్రాంతాలకు పంపించడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే స్పందించి పూర్తి స్థాయిలో వైద్యసేవలు అందేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ విజయమ్మ, నాయకులు ఫరుద్దీన్‌బాషా, రమణయ్య, వెంకటేశ్వర్లు, నాగరాజు పాల్గొన్నారు.

దోమల నివారణ చర్యలు



గంబూసియా చేపలు వదులుతున్న సిబ్బంది

ఉదయగిరిరూరల్, జూలై 25: దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గండిపాళెం ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి ఎం శివకల్పన అన్నారు. గురువారం పట్టణంలో కొనేరు, ఆనకట్ట, బాలాజీనగర్ ప్రాంతాల్లో నీటి నిల్వ ఉన్న ప్రదేశాల్లో గంబూసియా చేపలను వదిలి పెట్టారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి షేక్ నౌషాద్‌బాబు, ఆరోగ్య బోధకులు కలసిపాటి వెంకటసుబ్బయ్య, అంకమ్మ, నూర్జహాన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

ఉదయగిరిరూరల్, జూలై 25: మండలంలోని నేలటూరులో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం ఎంపీడీవో ఈశ్వరమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాల ప్రభావంతో సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని, ముందస్తు జాగ్రత్తగా పారిశుధ్యాన్ని మెరుగుపరిచి రోగాల బారినుంచి ప్రజలను కాపాడాలన్నారు. అలాగే సచివాలయంలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలోనూ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ మల్లికార్జున, కార్యదర్శి నాగూర్‌బీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై ఫిర్యాదు



భూ ఆక్రమణపై సర్వేయర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

అనంతసాగరం, జూలై 25: మండలంలోని బొమ్మవరం చెరువులో భూఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని బొమ్మవరం టీడీపీ నాయకులు సచివాలయ సర్వేయర్ సమరసింహారెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. గడిచిన మూడు రోజులుగా చెరువులో సుమారు ఐదు ఎకరాల భూమిలో మొక్కలు తొలగించి బోరు వేసి సాగుకు సిద్ధం చేస్తున్నారన్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియజేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కలువాయి వెంకటేశ్వర్లురెడ్డి, కలువాయి మనోహర్‌రెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

90 శాతం రాయితీపై గోకులాలు

కలిగిరి, జూలై 25: గోకులం పథకం కింద పాడిపశువులకు 90శాతం, గొర్రెలు, మేకలు, కోళ్లకు 70 శాతం రాయితీపై షెడ్డు నిర్మించుటకు మండలానికి 25 యూనిట్లు మంజూరైనట్లు పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డా. కే సురేష్‌బాబు తెలిపారు. ఆసక్తి కలిగిన రైతులు వారి పరిధిలోని రైతుసేవా కేంద్రాల్లో పశుసంవర్ధక సహాయకుల ద్వారా దరఖాస్తులు సమర్పించాల్సి ఉందన్నారు. షెడ్డుకు అవసరమైన మేర స్వంత భూమి కలిగి ఉండటంతోపాటు ఉపాధిహామీ పథకం జాబ్‌కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. సన్న, చిన్నకారు రైతులతోపాటు ఎస్సీ, ఎస్టీలు ఈ పథకానికి అర్హులని తెలిపారు. వివరాలకు సంబంధిత పశువైద్యశాలలో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ



ఉపాధిహామీ పనులు పరిశీలిస్తున్నఏపీవో

సీతారామపురం, జూలై 25: మండల కేంద్రమైన సీతారామపురంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులను ఏపీవో సుహాసిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కూలీలతో మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయాన్నే 6.30 నుంచి 11 గంటల వరకు పని చేయాలని, మీకు కేటాయించిన పనిని మాత్రమే చేస్తూ రోజుకు రూ.300లు వరకు సంపాదించవచ్చని తెలిపారు. అనంతరం రిజిస్టర్‌లోని పేర్లు చదివి వారికి హాజరు వేశారు.

ఘనంగా కల్చరల్ డే

చేజర్ల, జూలై 25: శిక్షా సప్తహ్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం కల్చరల్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నృత్యాలు, జానపదాలు, హరికథలు, బుర్రకథలు, వివిధ భాషల సంస్కృతిని విద్యార్థులకు తెలియపరిచేలా కార్యక్రమాలు నిర్వహించారు.

సేవాభావంతో వైద్యులు ముందుకు సాగాలి

కావలి వైద్యబృందానికి మంత్రి సత్కారం



సుబ్బారావును సత్కరిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

కావలి, జూలై 25: డాక్టర్స్ డే సందర్భంగా జూలై 1న రక్తసేకరణలో 1273 యూనిట్లు సేకరించి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించిన కావలి వైద్య బృందాన్ని అభినందిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సత్కరించారు. ఐఎంఏ కావలి శాఖ ఆధ్వర్యంలో వైద్యబృందం గురువారం కావలి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి చొరవతో మంత్రి సత్యకుమార్‌ను అమరావతిలోని ఆయన ఛాంబర్‌లో కలిసారు. ఐఎంఏ ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సహకారంతో కావలిలో రక్తదానశిబిరాలు చేపట్టి ఒక్కరోజున దేశంలోనే అత్యధికంగా రక్తసేకరణ చేసిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తమ సేవలను ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వారు చేసిన సేవలకు సంభందించిన వినతిపత్రాన్ని మంత్రికి అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని సత్కరించి సేవాభావంతో ముందుకు సాగాలన్నారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో ఏర్పాటుచేసిన తలసేమియా యూనిట్ ప్రారంభోత్సవానికి తాము త్వరలో ఆహ్వానిస్తామని, ఆకార్యక్రమానికి రావాలని రెడ్‌క్రాస్ సీనియర్ వైద్యులు డాక్టర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఐఎంఏ కావలిశాఖ అధ్యక్షుడు డాక్టర్ కే సుబ్బారావు, కార్యదర్శి గోపి, కోశాధికారి పామూరు శివప్రసాద్‌తో పాటు టీడీపీ రాష్ట్రకార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, నేత తిరువీధిప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడా కిట్ల వితరణ



క్రీడా కిట్లు బహూకరిస్తున్న కృష్ణారావు

కావలిటౌన్, జూలై 25: కావలి పట్టణ వెంగళరావు నగర్‌లోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ హైస్కూల్ పూర్వ ప్రధానోపాధ్యాయిని దివంగత పద్మతులసి జ్ఞాపకార్థం విద్యార్థులకు క్రీడా కిట్లు బహూకరించారు. గురువారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు హయ్యాల్‌హయ్యామ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పద్మతులసి భర్త కృష్ణారావు పాల్గొని విద్యార్థులకు క్రీడాపరికరాలు బహూకరించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ కొండారెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు శాంతకుమారి, శర్వాణి, అంజాద్‌ఆలి తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన పీవీ

ఉదయగిరిరూరల్, జూలై 25: మంత్రి నారా లోకేష్‌ను గురువారం రాష్ట్ర స్వచ్ఛంద సేవా సంస్థల సమాఖ్య అధ్యక్షులు పీవీ రమణయ్య మర్యాద పూర్వకంగా కలిశారు. 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లోనే విలీనం చేయాలని, దీంతో డ్రాపౌట్స్ సంఖ్య పెరుగుతుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో మాదిరిగానే ప్రాథమిక విద్య కొనసాగించాలని కోరడంతో మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

జలదంకి, జూలై 25: మండలంలోని అన్నవరానికి చెందిన టీడీపీ కార్యకర్త నీలం మల్లేశ్వరరావు (38) బుధవారం గుండెపోటుతో ప్రైవేటు వైద్యశాలలో మృతిచెందాడు. మృతదేహాన్ని గ్రామానికి తీసుకురావడంతో టీడీపీ నాయకుడు పూనూరు రామక్రిష్ణారెడ్డి గురువారం మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం తరపున చంద్రన్న భీమా సాయం అందేలా కృషిచేస్తామని, అంతేగాక పార్టీ తరపున, వ్యక్తిగతంగా కూడా ఆర్థిక సాయం అందేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట అన్నవరం ఎంపిటిసి కోర్శిపాటి మాధవరెడ్డి, టీడీపీ నేత దేవరపల్లి రమేష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాలకు ఫర్నిచర్ వితరణ

కావలిటౌన్, జూలై 25: కావలి రూరల్ మండల చలంచర్ల ప్రాథమిక పాఠశాలకు గ్రామస్థులు విశాఖపట్నంలో నివాసముంటున్న ఇరువూరు మాల్యాద్రి ఫర్నిచర్ వితరణ చేశారు. గురువారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని ఇప్పగుంట సావిత్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇరువూరు మాలాద్రి పాల్గొని ఫర్నిచర్ బహూకరించగా గ్రామ పెద్దలు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో చాగంటి వెంకటేశ్వర్లు గ్రామ పెద్దలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తహసీల్దారుకు సన్మానం

బిట్రగుంట, జూలై 25: సార్వత్రిక ఎన్నికల విధుల నిమిత్తం బోగోలు మండలం వచ్చిన తహసీల్దారు వెంకటరత్నం బుధవారం రాత్రి బదిలీ కావడంతో ఆయన్ను డిప్యూటీ తహసీల్దారు జూలియాబాయ్, రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించినట్లు వీఆర్వోల యూనియన్ నాయకుడు కిరణకుమార్ గురువారం తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని పంచాయతీల వీఆర్వోలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

ఉదయగిరిరూరల్, జూలై 25: మండలంలోని వెంకట్రావుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం ఎంఈవో మస్తాన్‌వలి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అమలవుతున్న శిక్ష సప్తహ్ కార్యక్రమాలతో పాటు విద్యార్థుల నైపుణ్యాలు, మధ్యాహ్న భోజనం, అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన భిన్నత్వంలో ఏకత్వం, మనదేశ సంస్కృతి, జానపద గేయాలు, నృత్య ప్రదర్శనలను తిలకించి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం బలరామయ్య పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

ఆత్మకూరు, జూలై 25: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించబడుతుందని ఎంపీడీవో బాలాజీనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ సభకు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, ఎన్ఆర్‌ఈజీఎస్ సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

లింగసముద్రం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ప్రసాద్ నియామకం

లింగసముద్రం, జూలై 25 : లింగసముద్రం మండల ఇన్‌చార్జ్ తహసిల్దార్‌గా (పూర్తి అదనపు బాధ్యతలు) కార్యాలయంలోని డిప్యూటీ తహసిల్దార్ తానికొండ ప్రసాద్‌ను జిల్లా కలెక్టర్ ఆనంద్ నియమించారు. దీంతో గురువారం ఆయన విధుల్లో చేరారు.

29 నుంచి పొగాకు కొనుగోలు

మర్రిపాడు, జూలై 25: రైతు వద్ద అదనంగా మిగిలిన పొగాకును సోమవారం నుంచి డీసీపల్లి బోర్డులో కొనుగోలు చేస్తున్నట్లు వేలం నిర్వహణాధికారి జీ. రాజశేఖర్ తెలిపారు. రైతు అనుమతి పొందిన మేర పొగాకును బోర్డు కొనుగోలు చేసి వేలాన్ని ఇటీవల ముగించారు. రైతు వద్ద అదనంగా ఉన్న పొగాకు మిగిలి ఉండటంతో కేంద్ర వాణిజ్య శాఖను అనుమతులు కోరారు. దీంతో రైతు నుంచి ఎటువంటి అపరాధ రుసుం లేకుండా కొనుగోలు చేసేందుకు ఆ శాఖ నుంచి అనుమతులు వచ్చాయని, అదనంగా ఉన్న పొగాకును ముందుగా బోర్డులో తెలియజేసి అమ్మకానికి రైతు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

నిధులు మంజూరుకు చర్యలు : సబ్ కలెక్టర్



కాలనీవాసుల నుంచి అర్జీలు తీసుకుంటున్న సబ్ కలెక్టర్ విద్యాధరి

లింగసముద్రం, జూలై 25: మండలంలోని వీఆర్ కోటలో 2013లో ఎస్టీలకు (యానాదులు) పక్కాగృహాల నిర్మాణానికి ఓ రైతు నుండి ప్రభుత్వం సేకరించిన భూమికి పరిహారం ఇవ్వకపోవడంతో ఆభూమిని కందుకూరు సబ్‌కలెక్టర్ జి విద్యాధరి పరిశీలించారు. 2013లో అప్పటి ప్రభుత్వం ఎస్టీ కాలనీలోని యానాదులు 32 మందికి ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మించేందుకు గ్రామానికి చెందిన కాటా మనోజ్ అనే రైతుకు చెందిన సర్వే నంబరు 96/2లోని 1.05 సెంట్ల భూమిని సేకరించింది. అయితే రైతు నుండి భూమిని సేకరించి ఎస్టీలకు పక్కా గృహాలు నిర్మించిన ప్రభుత్వం రైతుకు పరిహారం మంజూరు చేయలేదు. దీంతో ఆ రైతుకు పరిహారం మంజూరు నిమిత్తం గురువారం ఉదయం సబ్ కలెక్టర్ విద్యాధరి ఆ భూమిని పరిశీలించి, అందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎస్టీ కాలనీవాసులు తమకు ఆధార్‌కార్డులు లేవని తగిన చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ విద్యాధరిని కోరారు. ఈ సందర్భంగా పలువురు ఆమెకు వినతి పత్రాలను అందజేశారు. రెండు వారాల్లో గ్రామంలో ఆధార్ క్యాంపు ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసిల్దార్ టి ప్రసాద్, వీఆర్ఓ పి అమానుల్లాఖాన్, స్థానిక టీడీపీ నేతలు మాజీ సర్పంచు ముప్పరాజు లక్ష్మీనరసింహం, ఉన్నం వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అల్లూరు, జూలై 25: కలెక్టరు ఆదేశాల మేరకు అల్లూరు మండలంలోని అన్ని పంచాయతీల్లో ఆధార్ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఎంపీడీవో జ్యోతి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ 15 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు, చిరునామా, ఫోన్ నెంబరు, ఫోటోలు, తదితర అంశాల్లో మార్పులు, చేర్పులకు ఆధార్ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నార్తుమోపూరులో ఆధార్ కేంద్రాన్ని కమిషనర్ ఫణికుమార్ పరిశీలించగా కార్యదర్శి వరప్రసాద్ పర్యవేక్షణలో కొనసాగింది.

● సంగం : స్థానిక సచివాలయం -1లో శిశు ఆధార్ ప్రత్యేక నమోదు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో 5 సంవత్సరాలలోపు పిల్లలకు ఆధార్ తీస్తారని, ఇప్పటికీ ఆధార్ పొందని చిన్న పిల్లల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈవోఆర్డీ అప్పాజీ తెలిపారు.

ఆధార్ శిబిరం తనిఖీ

వరికుంటపాడు: మండలంలోని కాంచెరువు సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని గురువారం ఎంపీడీవో వెంకటకృష్ణకుమారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం 50 మందికి తగ్గకుండా సేవలు అందించాలన్నారు. అలాగే గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించి శిబిరాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి తగు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి జిలానీ, డిజిటల్ అసిస్టెంట్ మహేష్ పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం : సీపీఎం



నిరసన తెలియజేస్తున్న సీపీఎం శ్రేణులు

కావలిటౌన్, జూలై 25: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం జరిగిందని ప్రత్యేక హోదా ప్రకటించలేదని సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ట్రంకురోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచులయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పుల్లయ్య మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో మన రాష్ట్రానికి ఒరింగేదేమీ లేదని, ప్రధాని మోడి విభజన హామీలు, ప్రత్యేక హోదా ఏఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. 15వేల కోట్ల అప్పు ఇచ్చి గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో అధికారంలోనున్న కూటమి ప్రభుత్వం కేంద్రంపై వత్తిడి తెచ్చి ప్రత్యేక హోదా ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీలు సాధించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు టీ మాల్యాద్రి, పట్టణ నాయకులు తిరుపాల్, కృష్ణమోహన్, మధుసూధన్‌రావు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవో నెం.117 రద్దు చేయాలి : యుటీఎఫ్

కావలిటౌన్, జూలై 25: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని, జీవో నెంబర్ 117 రద్దు చేయాలని యుటీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఎంఈవో, ఎంపీడీఓలకు వినతి పత్రాలు అందించి నిరసన తెలిపారు. మండల యుటీఎఫ్ అధ్యక్షుడు ముజీబ్‌అహమద్ మాట్లాడుతూ యుటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యాశాఖాధికారులకు, ఎంపీడీవోలకు వినతిపత్రాలు అందించామన్నారు. పాఠశాలలు తెరచి రెండునెలలు కావస్తున్నా యాప్‌ల వలన విద్యాయేతర పనుల వలన బోధనకు ఆటంకం కలుగుతోందని, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీవో 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ప్రసాద్, లక్ష్మీ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు



ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్‌డీవో మధులత

చేజర్ల, జూలై 25: గ్రామాల్లోని ప్రభుత్వ పోరంబోకు భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఆత్మకూరు ఆర్‌డీవో మధులత తెలిపారు. గురువారం మండలంలోని పెళ్లేరు, తూర్పు కంభంపాడు గ్రామాల్లో గ్రామ కంఠం, పెన్నా పోరంబోకు భూముల ఆక్రమణలపై గ్రామస్తుల ఫిర్యాదు మేరకు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి తహసీల్దారు అశోక్‌బాబు, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయలలితకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుమతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌కు స్పాట్ అడ్మిషన్లు

కావలి రూరల్, జూలై 25: కావలి మండలం రుద్రకోట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నుండి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్ ప్రియ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్లలో భాగంగా జూలై 31న ధ్రువపత్రాల పరిశీలన, ఫీజు చెల్లింపులు ఉంటాయన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులు, ఇంటర్మీడియట్ పాస్ ఆర్ ఫెయిల్ లేదా ఐటిఐ ఉత్తీర్ణులైన విద్యార్థులు స్పాట్ అడ్మిషన్ల ద్వారా రుద్రకోటలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరుటకు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సమాచారం కోసం సెల్: 7989799136, 9908299081, 9912983434 నెంబర్లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

గోకులాలకు దరఖాస్తు చేసుకోవాలి

వరికుంటపాడు, జూలై 25: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మంజూరు చేసిన మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోవాలని పెద్దిరెడ్డిపల్లి పశువైద్యాధికారి రాఘవేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా మొత్తం 1300 షెడ్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగా మండలానికి 25 కేటాయించడం జరిగిందన్నారు. రైతు వాటాతో సహా ఉపాధి హామీ నిధులను కలిపి వాటిని నిర్మించడం జరుగుతుందన్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారితో పాటు మహిళా యజమానులు, ఎస్సీ ఎస్టీ, వలసవాసులు, చిన్న, సన్నకారు రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నెల్లూరు సిటీ, రూరల్
కోవూరు, సర్వేపల్లి

కార్పొరేషన్ రెవెన్యూలో కీచులాట

● ఆర్ఐ పోస్టుల కోసం అడ్మిన్లు.. ఆర్వోల కోసం ఆర్ఐల పాకులాట ● అర్హతలు లేకపోయినా పదోన్నతికి పట్టు
● అనుకూలత చూపితే భారీ మొత్తాల సమర్పణ



నెల్లూరు(సిటీ), జూలై 25 : ఎన్ఎంసీలోని రెవెన్యూ విభాగంలో అధికారుల అంతర్గత కుమ్ములాట ప్రారంభమైంది. తమకు ఆర్ఐ పోస్టులు కావాలంటూ వివిధ సచివాలయాలకు చెందిన అడ్మిన్లు, ఆర్వోల కోసం కొంతమంది ఆర్ఐలు పాకులాడుతున్నారు. తమకు అనువైన డివిజన్లు కేటాయించాలని ఇంకొందరు ఆర్ఐలు రాజకీయ పైరవీలు చేస్తున్నారు. అర్హత లేకపోయినా పదోన్నతికోసం పట్టుబడుతున్నారు. తాము కోరుకున్న పోస్టింగ్ ఇప్పిస్తే భారీ మొత్తంలో సమర్పించుకుంటామని రాజకీయ నేతలకు ఆఫర్లు ఇస్తున్నారు. కాగా ఏళ్ల తరబడి పాతుకుపోయిన వారిని ఇకనైనా కదిలించి, అర్హత కలిగిన వారికి ఆర్ఐలుగా బదిలీ చేయాలన్న విజ్ఞప్తులు అటు అధికారులకు, ఇటు అధికార పార్టీనేతలకు చేరుతున్నాయి. ఈ క్రమంలో తాజా బదిలీలు కార్పొరేషన్‌లో చర్చనీయాంశంగా మారాయి.

● ఇప్పటికే ప్రతిపాదనలు

కొత్తూరు, కొండాయపాళెం, ఆకుతోట, మైపాడుగేట్, ముత్యాలపాళెం సచివాలయాల్లో అడ్మిన్లుగా పనిచేస్తున్న కొందరు తమకు ఆర్ఐలుగా పోస్టింగ్ ఇప్పించాలని ఉన్నతాధికారుల వద్ద ప్రతిపాదనలు పెట్టారు. ఏళ్ల తరబడి ఆర్ఐలుగా కొనసాగుతున్న వారు ఆర్వోగా ఉద్యోగోన్నతి కల్పించాలని పట్టుబడుతున్నారు. కానీ ఇది అసాధ్యమే. అయితే సాధ్యం చేసిన రాజకీయ నేతలకు భారీ ప్యాకేజీ ఇస్తామని చెబుతున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న డివిజన్లు తమకు చాలడంలేదని, మరిన్ని డివిజన్లు కేటాయిస్తే అందుకు తగిన రీతిలో రుణం తీర్చుకుంటామని ఆర్ఐలు కొందరు బహిరంగంగానే ప్రకటిస్తున్నారు

● అర్హతలు లేకున్నా...

ఆర్ఐలు కావాలనుకున్న వారికి అర్హతలు లేవు. ఆర్వోలుగా పదోన్నతి పొందాలనుకునే వారికి కూడా అర్హతలు లేవు. కానీ అభ్యర్థనలు మాత్రం పోటెత్తుతున్నాయి. ఉన్నతాధికారులను ఈ తంతు విస్మయానికి గురి చేస్తుండగా, రాజకీయ నేతలను అయోమయానికి గురి చేస్తున్నది. ఆర్ఐగా పని చేయాలంటే సీనియర్ సహాయకుల ర్యాంకుండాలి. ఆర్వో కొనసాగాలంటే సూపరింటెండెంట్ అయిఉండాలి. కానీ ఇవేమీలేని వారు వాటి కోసం వెంపర్లాడటం ఆశ్చర్యానికి గురి చేస్తున్నది.

● పాతుకుపోయిన వారి సంగతేంటి ?

ఆర్ఐలుగా పనిచేస్తున్నవారు సుమారుగా 15-20 ఏళ్లుగా కొనసాగుతున్నారు. రెవెన్యూలో సీనియర్ సహాయకులుగా మిగిలినవారు ఉన్నా, వారికి కూడా ఆర్ఐ అవకాశాలు కల్పించాలన్న అభ్యర్థనలను ఉన్నతాధికారులు పట్టించుకోవాలని పలువురు కోరుతున్నారు. ఆర్వోలుగా ఉన్న అధికారులు ఏళ్ల తరబడి అదే పోస్టుల్లో కొనసాగుతున్నారు. వీరిని కూడా మిగిలిన కేడర్లలో బదిలీ చేయాలన్న వాదన వినిపిస్తుంది. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ సూర్యతేజ రెవెన్యూ విభాగాన్ని ఎలా ప్రక్షాళన చేస్తారో వేచి చూడాలి.

దోమల నివారణకు చర్యలు



గంబూషియా చేపలను వదులుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య తదితరులు

నెల్లూరు (వైద్యం) జూలై 25 : దోమల నివారణకు కాలువల్లో గంబూషియా చేపలను గురువారం డీఎంహెచ్‌వో డాక్టరు పెంచలయ్య వదిలారు. నగరంలోని మూలాపేటలోని శివాలయం కోనేరులో ఈ చేపలను ఆయన వదిలారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లార్వా దశలోనే దోమలను నివారించేందుకు ఈ పద్ధతి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ మాట్లాడుతూ ఎలాంటి నీటినిల్వలు లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేను పాటించి నిల్వఉన్న నీటిని బయట పారబోయాలన్నారు. రాత్రిపూట దోమతెరలు వాడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా నివారణ అధికారి నాగార్జునరావు, జయరామ్, శ్యాంసన్‌బాబు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హైవేపై ఫ్లైఓవర్లు ఎప్పుడు పూర్తి చేస్తారు ?


● పార్లమెంట్‌లో ఎంపీ వేమిరెడ్డి



కేంద్ర మంత్రి సోనోవాల్‌తో మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(హరనాథపురం), జూలై 25 : జిల్లాలో నేషనల్ హైవేపై ఫ్లైఓవర్లు, వెహికల్ అండర్ పాస్‌లు ఎప్పటికి పూర్తి చేస్తారని పార్లమెంటులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి గురువారం ప్రశ్నించారు. ఇందుకు కేంద్ర రోడ్డు, రవాణా, హైవే శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమాధానమిస్తూ జిల్లాలోని గొలగమూడి జంక్షన్ వద్ద రాకపోకల అండర్‌పాస్, నెల్లూరు టీ-జంక్షన్ వద్ద ఫ్లైఓవర్, సుందరయ్య కాలనీ జంక్షన్ వద్ద సర్వీస్ రోడ్డు నిర్మాణపనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. కాగా జిల్లాలోని పోర్టుల స్థితిగతులపై వీపీఆర్ గురువారం కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బానంద్ సోనోవాల్‌తో చర్చించారు. ఢిల్లీలోని మంత్రి చాంబర్‌కు చేరుకుని ఆయన్ను శాలువాతో సత్కరించి, పలు అంశాలపై చర్చించారు. జిల్లాలోని పోర్టులు, వాటి స్థితిగతులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై కూడా చర్చించారు.

ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేసిన వైసీపీ : చేజర్ల



నెల్లూరు (వైద్యం) జూలై 25 : గతంలో పేదలకు ఉచిత విద్య అందించాలన్న ఉద్దేశంలో ఎయిడెడ్ విద్యాసంస్థలను నెలకొల్పారని, అయితే వైసీపీ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసిందని టీడీపీ నెల్లూరు పార్లమెంట్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దశాబ్దాల క్రితం నెలకొల్పిన ఈ విద్యాసంస్థల ఆస్తులు విలువ పెరగటంతో గత వైసీపీ నాయకుల దృష్టి వాటిపై పడిందన్నారు. దీంతో ఆయా విద్యాసంస్థలను ప్రభుత్వానికి అప్పగిస్తే వాటిని నిర్వహిస్తుందని, లేదంటే ఎయిడ్‌ను నిలిపేస్తామని హెచ్చరించిందన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 423 విద్యాసంస్థలు మూతపడగా, 845 విద్యాసంస్థలు గ్రాంట్ ఇన్ ఎయిడ్‌ను వదులుకుని ప్రైవేట్ విద్యాసంస్థలుగా మారిపోయాయన్నారు. రాష్ట్రంలోని ప్రసిద్ధి చెందిన వీఆర్ కళాశాలతోపాటు అనేక సంస్థలు తమ సేవలు నిలిపివేశాయన్నారు. ఈ క్రమంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ వీఆర్ కళాశాలతో పాటు ఇతర విద్యాసంస్థలను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన కోరారు.

ట్రాక్టర్ ప్రమాదంలో టీడీపీ నాయకుడు దుర్మరణం

వెంకటాచలం, జూలై 25: మండలంలోని గొట్లపాళెం గ్రామంలో గురువారం జరిగిన ప్రమాదవశాత్తు జరిగిన ట్రాక్టర్ ఘటనలో టీడీపీ నేత మృతి చెందాడు. వివరాల మేరకు గ్రామానికి చెందిన టీడీపీ నేత మందల శ్రీహరి (55) తన ఇంటి అవసరాల కోసం ట్రాక్టర్‌లో మట్టిని తీసుకొని వచ్చాడు. మట్టిని లోనికి తరలించడానికి ట్రాక్టర్ ఇంజన్ స్టార్టింగ్‌లోనే ఉంచి అడ్డు ఉన్న వాటిని తొలగిస్తుండగా ట్రాక్టర్ దొల్లడంతో పాటు వెనకాలే ఉన్న శ్రీహరిపై ఎక్కడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. పక్కనే ఉన్న శ్రీహరి భార్య ధనమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● పలువురి నివాళి

ప్రమాదశాత్తు మృతి చెందిన టీడీపీ నేత మందల శ్రీహరికి గురువారం సాయంత్రం సర్వేపల్లి నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఘన నివాళులర్పించారు. శ్రీహరి కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని, తమ సహాయసహకారాలు ఉంటాయన్నారు. ఆయన వెంట పార్టీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్, తెలుగురైతు రాష్ట్ర ప్రధానకార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు, స్థానిక టీడీపీ నేతలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

షిరిడీ సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 25 : నగరంలోని ట్రంకురోడ్డు గాంధీనగర్ షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం విశేష పూజలు జరిగాయి. ఉదయం షిరిడీ హారతి, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, గంధం, పన్నీరు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం బాబావారికి సహస్ర నామ పూజలు జరిగాయి. మధ్యాహ్నం హారతి, మం త్రపుష్పం, తీర్థ ప్రసాదాల వినియోగం జరిగింది. సాయంత్రం సంధ్యా హారతి, ప్రత్యేక పల్లకి సేవ, సాంస్కృతిక కార్యక్ర మాలు షిరిడీ హారతులు జరిగాయి. కార్యక్రమాలను మందిరం చైర్మన్ మన్నెం అమరనాథ్‌రెడ్డి, కొల్లి శ్యామసుందర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



దండం పెడుతున్న ఎస్సీ హాస్టల్ విద్యార్థినులు

థ్యాంక్యూ.. ఎమ్మెల్యే సార్ !

● ప్రమాదం నుంచి బయటపడిన హాస్టల్ విద్యార్థినులు

మనుబోలు, జూలై 25: క్షణ క్షణం..భయం భయంగా ఉన్న హాస్టల్ నుంచి సురక్షిత హాస్టల్‌కు తరలించినందుకు ఎస్సీ బాలికల హాస్టల్ విద్యార్థినులు గురువారం ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. శిథిలావస్థలో ఉన్న హాస్టల్‌లో బిక్కు బిక్కు మంటూ 70మంది విద్యార్థులు చదువులు సాగిస్తున్నారు. బాలికల పాఠశాల హెచ్ఎం ఎమ్మెల్యే సోమిరెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించి కలెక్టర్‌కు ఫోన్‌చేసి సమస్యను వివరించి పరిష్కరించాలని కోరారు. దీంతో కలెక్టర్ ఆనంద్ డీడీ వెంకటయ్యను ఆదేశించారు. ఆయన వెంటనే విద్యార్థినులను సురక్షిత హాస్టల్‌కు తరలించారు. ఈ సందర్భంగా హాస్టల్ మ్యాట్రిన్ మహేశ్వరి ఎమ్మెల్యే, కలెక్టర్, డీడీకి, టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

హైస్కూల్ అభివృద్ధికి చేయూత

విడవలూరు, జూలై 25: విడవలూరులోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 1972-73లో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలను అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి దేవళ్ల శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సోమవరపు జానార్ధన్ రెడ్డి, సోమవరపు రవికుమార్ రెడ్డిలు సైకిల్ స్టాండ్ నిర్మాణం, ఆదిశంకర విద్యాసంస్థల అధినేత వంకి పెంచలయ్య 50 ఫ్యాన్లు, దేవర్ల శ్రీనివాసులురెడ్డి, మిగిలిన విద్యార్థులు 54 బెంచీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న మోహనశ్రీకి ఇంటర్ వరకు చదువునకు అయ్యే ఖర్చుని భరిస్తున్నట్లు పూర్వ విద్యార్థి తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులు ఎంఈవోలు నాగపద్మ, వెంకటేశ్వర్లురెడ్డి, హేచ్ఎం రమేష్‌లు పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు.

అలరించిన పద్యనాటకాలు

నెల్లూరు (సాంస్కృతికం) : నగరంలోని పురమందిరంలో గురువారం సత్యహరిశ్చంద్ర, చింతామణి పద్యనాటకాల ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. జిల్లా పద్యనాటక కళాకారుల సంఘం ఆధ్వర్యంలో గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ఈ నాటకాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు భద్రాచలం బాబా మాట్లాడుతూ ప్రభుత్వం, కళాపోషకులు, ప్రేక్షకులు నాటకాలను ఆదరించేందుకు ముందుకు రావాలని విజ్ఞప్తి చేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి చక్రపాణి, సంఘం కార్యవర్గ సభ్యులు, పద్యనాటక అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

మానసిక వ్యాధిగ్రస్థులకు ఉచిత న్యాయం

నెల్లూరు (వైద్యం) : మానసిక వ్యాధిగ్రస్థులైన మహిళలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తామని సీనియర్ సివిల్ న్యాయాధికారి కే వాణి తెలిపారు. గురువారం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో మానసిక రోగుల స్థితిగతులు స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం జరిగిన ఉద్యోగులు ప్రదర్శనలో ఆమె మాట్లాడుతూ హెల్మెట్ తప్పని సరిగా ధరించి వాహనం నడపాలన్నారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దానాయక్, డాక్టర్ లక్ష్మీప్రసన్న, డాక్టర్ ఎంసీఎస్ నాయుడు, డిప్యూటీ సూపరింటెండెంట్ పద్మావతి, డాక్టర్ రాధ పాల్గొన్నారు.

పిల్లల్లో అంధత్వ నివారణ అందరి బాధ్యత

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 25: పాఠశాలల్లో పిల్లల అంధత్వాన్ని నివారించడం అందరి బాధ్యత అని కంటి వైద్య నిపుణులు ఎం శ్రీలేఖ అన్నారు. బుచ్చి ఎంఈవో కార్యాలయం లో గురువారం పాఠశాల పిల్లల్లో ఏర్పడే కంటి సమస్యలపై జిల్లా అంధత్వ నివారణా సంస్థ అధ్వర్యంలో ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం దిలీప్‌కుమార్, హెచ్ఎం సుజాత, పి ఫనీష్, జిల్లా రిసోర్సు సభ్యులు గండికోట సుదీర్‌కుమార్, సీఆర్ఎంటీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

మనుబోలు, జూలై 25: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆకుల పోలయ్య(21) గురువారం తిరుపతి రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పొలాల్లో నివాసం ఉంటున్న పోలయ్య ఈనెల 19న రాత్రి సమయంలో బద్దెవోలు క్రాస్ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గాయాల పాలయ్యాడు. ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో పోలయ్య తండ్రి చినబ్బయ్య బోరున విలపిస్తున్నాడు. ప్రభుత్వం ఆదుకుని గిరిజన కుటుంబానికి సాయం అందజేయాలని పలువురు కోరుతున్నారు.

బీసీజీ వ్యాక్సినేషన్ పరిశీలన

ఇందుకూరుపేట, జూలై 25: మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేబూరు బిట్-1, లేబూరు బిట్-2 పరిధిలో గురువారం అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని స్టేట్ టీబీ అబ్జర్వర్ డాక్టర్ తహసీనా, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి పరిశీలించారు. బీసీజీ ఇంజక్షన్ వేయించుకోవడం వల్ల ఊపిరితిత్తులు, క్షయ తదితర వ్యాధులను దూరం చేస్తుందని వారు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, జిల్లా ప్రోగ్రాం మేనేజర్ విజయకుమార్, హెచ్ఈవో శ్రీనివాసరావు, హెల్త్ సూపర్‌వైజర్‌లు రమా, సతీష్‌బాబు, ఫార్మశీ ఆఫీసర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఇన్‌చార్జ్ వీసీ విజయభాస్కర్‌రావు

మొక్కలు ఉంటేనే మానవ మనుగడ

వెంకటాచలం : మొక్కలు ఉంటేనే మానవ మనుగడ సాధ్యమని వీఎస్‌యూ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడు తూ ప్రస్తుతం నెలకొని ఉన్న ప్రతికూల పర్యావరణ పరి స్థితుల్లో పెద్దఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, పరీక్షల నిర్వాహణాధికారిణి డాక్టర్ ఆర్ మధుమతి, ఎన్ఎస్ ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, ఏ. మహేం దర్‌రెడ్డి, డాక్టర్ జీ సుజయ్‌కుమార్, విజయానంద్ కుమార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో సమస్యల పరిష్కారం

విడవలూరు: కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి సహకారం తో గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య తెలిపారు. విడవలూరులో గురువారం జరిగిన గ్రామసభలో ఆయన పా ల్గొన్నారు. జాన్‌పేట, మన్మథరావుపేటలో టీడీపీ హయాంలో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ని ఉపయోగంలోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచు ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు మాతూరు శ్రీనివాసులురెడ్డి, నాయకులు బెజవాడ గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

మెదడులో రక్తస్రావానికి ఆధునిక శస్త్రచికిత్స

నెల్లూరు (వైద్యం) : మెదడులోని రక్తస్రావానికి నెల్లూరు అపోలోలో అత్యాధునిక శస్త్రచికిత్స అందించినట్లు ఆ ఆసుపత్రి మెడికల్ సర్వీసెస్ డైరెక్టర్ శ్రీరామ్‌సతీష్ తెలిపారు. గురువారం ఆసుపత్రిలో న్యూరోసర్జన్ డాక్టర్ వెంకట్ మాట్లాడుతూ కందుకూరుకు చెందిన సుబ్రహ్మణ్యం(78) మెదడులో రక్తస్రావానికి గురై తమ ఆసుపత్రిలో చేరారన్నారు. ఎండోస్కోపీ పద్ధతి ద్వారా రక్తస్రావాన్ని నివారించి శస్త్రచికిత్సను చేశామన్నారు. మూడు రోజులలోనే రోగి కోలుకున్నాడని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మత్తు వైద్యనిపుణులు రాజమోహన్‌రెడ్డి, ఆసుపత్రి యూనిట్ హెడ్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

కేసుల రద్దు ప్రకటనపై హర్షం

నెల్లూరు(హరనాథపురం) : గత ప్రభుత్వంలో సీపీఎస్ ఉద్యోగులపై పెట్టిన కేసులను సమీక్షించి, వాటిని రద్దు చేస్తామని అసెంబ్లీలో గురువారం సీఎం చంద్రబాబు ప్రకటించటం హర్షణీయమని సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ధనరాజ్, కార్యదర్శి సీహెచ్ పెంచలయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిరంకుశంగా ప్రవేశపెట్టిన జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రాంగణ ఎంపికల్లో 'నారాయణ' ప్రతిభ

నెల్లూరు (విద్య), జూలై 25 : ఎంఎన్‌సీ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిమ, ప్రేమ్ సందీప్, శ్రీతేజ అత్యధిక ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. గురువారం కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్వాడ్రా ఇన్‌ఫర్మేషన్ సర్వీసెస్ సంస్థ నిర్వహించిన ఎంపికల్లో నారాయణ విద్యార్థులు పలువురు ఉద్యోగాలను సొంతం చేసుకున్నారన్నారు. అనంతరం విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయశర్మ, సీఎస్‌సీ విభాగాధిపతి డాక్టర్ రాజేంద్ర, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలి



డీఈవోకి వినతిపత్రం అందచేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నెల్లూరు (విద్య), జూలై 25 : ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని, గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం 117ను రద్దు చేయాలని యూటీఎఫ్ నేతలు కోరారు. గురువారం వారు డీఈవో రామారావుకు వినతిపత్రం అందచేశారు.అనంతరం రాష్ట్ర కార్యదర్శి ఎన్.నవకోటేశ్వరరావు మాట్లాడుతూ గత ప్రభుత్వ నిర్ణయాలతో విద్యారంగం నిర్వీర్యమైపోయిందన్నారు. తిరిగి వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం, అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా జీవో నెం 117ను రద్దు చేసి ఒకటి నుంచి ఐదు తరగతుల ప్రాథమిక పాఠశాలలను కొనసాగించాలన్నారు. ఉపాధ్యాయులను బోధనకే కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వీవీ.శేషులు, జీవీ.చలపతిశర్మ, ఎంసీ అచ్చయ్యఏ.మురళీధర్‌రావు, ఎన్.సురేంద్రబాబు, ఎస్‌కె.ఖాజావలి, జీ.దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాబాయ్ హత్యపై ధర్నా ఎందుకు చేయలేదు?



మాట్లాడుతున్న భరత్‌కుమార్ తదితరులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 25: మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఆయన బాబాయ్ హత్యపై ఢిల్లీలో ఎందుకు ధర్నా చేయలేదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భరత్‌కుమార్‌యాదవ్ ప్రశ్నించారు. బీజేపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మీ బాబాయిని ఎవరు చంపారన్న విషయం అందరికీ తెలిసిందే అని, చంపిన వారికే ఎంపీ టికెటు ఇవ్వలేదా అని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం కారు డ్రైవర్‌ను హత్య చేసినప్పుడు, వైసీపీ నాయకుల వల్ల కావలిలో కరుణాకర్ ఆత్మహత్య చేసుకున్నప్పుడు, ఒక ఎంపీని దారుణంగా కొట్టి ఆధారాలు లేకుండా చేసినపుడు మీకు ధర్నాలు గుర్తుకురాలేదా అని ప్రశ్నించారు. ఈ రోజు ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని అభాసుపాలు చేయాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కందికట్ల రాజేశ్వరి, మిడతల రమేష్, చిలకా ప్రవీణ్‌కుమార్, దాసరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పొర్లుకట్టల పటిష్టానికి గ్రామసభలో తీర్మానం

బుచ్చిరెడ్డిపాళెం, జూలై 25: మినగల్లుకి వరదముప్పు రాకుండా పెన్నా పొర్లుకట్టల పటిష్టానికి గ్రామసభలో సర్పంచు, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మినగల్లు పంచాయతీ కార్యాలయంలో సర్పంచు అధ్యక్షతన గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ జరిగింది. పెన్నానదికి ఎప్పుడు వరదలొచ్చినా పెన్నా పొర్లుకట్టల వల్ల మినగల్లుతోపాటు చుట్టుపక్కల గ్రామాలకు వరద ప్రమాదం పొంచివుందన్నారు. ఈమేరకు వెంటనే పెన్నా పొర్లుకట్టలను పటిష్ట పరచాలని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమస్యను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి దృష్టికి తీసుకెళ్లి పొర్లుకట్టల వల్ల గ్రామాలకు పొంచివున్న ప్రమాదాన్ని వివరిస్తామన్నారు. ఈ సమావేశంలో పలువురు వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జూలై 25: జనసేన నాల్గవ విడత క్రియాశీల సభ్యత్వ నమోదును గురువారం సాయంత్రం ఆత్మకూరు బస్టాండు, జేమ్స్‌గార్డెన్ ప్రాంతాల్లో చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేత టోనిబాబు మాట్లాడుతూప్రతి మండలం, గ్రామంలో జనసైనికులు ముందుకు వచ్చి క్రియాశీలక సభ్యత్వం పూర్తి చేయించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పవన్‌కళ్యాణ్ అభిమాన సంఘం నాయకులు బడే రవి, సైయద్ జిలాని బాషా, రహమ్‌తుల్లా, మహబూబ్ సుభాని. షేక్ చాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి ఆలయంలో కుంకుమార్చనలు

నెల్లూరు (సాంస్కృతికం): రాజరాజేశ్వరి ఆలయంలో శ్రావణ శుక్రవారాల్లో సామూహిక లక్ష కుంకుమార్చనలు నిర్వ హించనున్నట్లు ఆలయం చైర్మన్ రత్నం జయరామ్, సహాయ కమిషనర్ బీ.వెంకటసుబ్బయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన దలచినవారు ఆలయంలో రూ.600 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఆలయ ఆఫీసులో సంప్రదించాలని కోరారు.

28న జిల్లా క్రికెట్ జట్లు ఎంపికలు

నెల్లూరు (విద్య): జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో అండర్-23 క్రికెట్ జట్టు ఎం పికలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డీ నిఖిలేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలు, సొంత కిట్‌తో ఆరోజు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు.

పీఎన్ఎం స్కూల్లో ఆధార్ క్యాంపు

నెల్లూరు(సిటీ), జూలై 25 : నగరంలోని జెండావీధి వద్దనున్న పీఎన్ఎం స్కూల్లో ఆధార్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు టీడీపీ మైనార్టీ నేత జాఫర్ షరీఫ్ గురువారం తెలిపారు. బుధవారం నుంచి ఈ క్యాంపు అందుబాటులో ఉంటుందన్నారు. దీంతోపాటు పాఠశాలలోని విద్యార్థులకు ఉర్దూ పాఠ్యపుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

30న ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు (వైద్యం) : నగరంలోని రెయిన్‌బో సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈనెల 30న ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్‌కుమార్ తెలిపారు. గురువారం ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎముకలు, కీళ్ల వ్యాధులకు సంబంధించి ఈ వైద్య శిబిరం ని ర్వహిస్తున్నామని చెప్పారు. ఎముక పరీక్షలు, స్కానింగ్, యూరిక్ యాసిడ్, రక్తపరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని బోన్ క్యాన్సర్ ఆర్థోడిక్ వైద్య నిపుణులు అనిల్‌చౌదరి తెలిపారు.

టిప్పుసుల్తాన్ విగ్రహం ఏర్పాటును అడ్డుకోవటం ఏమిటి ? : సీపీఐ

నెల్లూరు (వైద్యం) జూలై 25 : నగరంలో టిప్పుసుల్తాన్ విగ్రహం ఏర్పాటును బీజేపీ అ డ్డుకోవటం ఏమిటని సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ ప్రశ్నించారు. గురువారం సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. టిప్పుసుల్తాన్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను తాము కోరు తుంటే, బీజేపీ నేతలు మాత్రం వద్దంటూ చెబు తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమం లో ముస్లిం ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు జియా, జి ల్లా అధ్యక్షుడు అజీజ్ అహ్మద్, సీపీఐ జిల్లా నేత షాన్‌వాజ్, అవాజ్, జిల్లా కన్వీనర్ మౌలానా ఆజీజ్, సర్దార్, మస్తాన్‌బాబు పాల్గొన్నారు.

అసెంబ్లీలో వేదగిరి ప్రస్తావన అభినందనీయం

నెల్లూరురూరల్, జూలై 25 : వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్రం అమలు చేస్తున్న ప్రసాదం పథకం ద్వారా రూ. 50 కోట్లను మంజూరు చేయించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఈ అంశాన్ని అసెంబ్లీ సమావేశాల్లో గురువారం ప్రస్తావనకు తీసుకురావడం అభినందనీయమని ఆలయ మాజీ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దేవరపాళెంలో ఆయన మాట్లాడుతూ ఈ అంశం సభలో ప్రస్తావించడంతో మళ్లీ వేదగిరి అభివృద్ధిపై ఆశలు చిగురించాయని తెలిపారు.

వాహనాల వినియోగంపై అవగాహన

నెల్లూరు (విద్య) : డీకే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం ద్విచక్ర వాహన దారులు-హెల్మెట్ వాడకం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మహిళా అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ టీఎస్.లలిత మాట్లాడుతూ సురక్షిత ప్రయాణం హెల్మెట్‌తోనే సాధ్యమన్నారు. అనంతరం ట్రాఫిక్ నిబంధనల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి, పీడీ డాక్టర్ సీ విజయకళ, ఎన్ ఎస్ఎస్ ప్రో గ్రాం ఆఫీసర్ వై.దివ్య, డాక్టర్ మనోజ్‌కు మార్ పాల్గొన్నారు.


న్యాయ విజ్ఞాన సదస్సు

సైదాపురం : స్థానిక జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో గురువారం సాయంత్రం న్యాయ వి జ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ లోకనాథం విద్యార్థులకు బాలల హక్కులపై అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో ఎస్ఐ విజయ్ కుమార్, డీటీ అనురాధ, న్యాయవాదులు కోటేశ్వరరావు, రఫీ పాల్గొన్నారు.

ఇస్కపాళెంలో స్వచ్ఛభారత్

వెంకటాచలం : ఇస్కపాళెంలో గురువారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి చెత్తబుట్ట పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత పీ. శ్రీనీతరెడ్డి, బీజేవైఎం మండలాధ్యక్షుడు గోత్తల నరేష్, నాయకులు కాకి శివశంకర్, జోగి సునీల్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 26 జూలై 2024



- ఐదేళ్ళుగా కొండపై దుకాణాల దందా
- గత బోర్డు ముఖ్యుల పేరిట భారీగా వసూళ్ళు
- విజిలెన్స్ విచారణలో వెల్లడైనా వేటు వేయని ధర్మారెడ్డి
- ప్రభుత్వం మారినా నిక్షేపంగా కొనసాగుతున్న ప్రాబల్యం

తిరుమల రెవిన్యూ విభాగంలో అవినీతి తిమింగలాలు హల్‌చల్ చేస్తున్నాయి. గత ఐదేళ్ళుగా కొండపై దుకాణాల దందాలో వీరి పేర్లు మారుమోగాయి. నాటి పాలకమండలి ముఖ్యుల పేరిట భారీగా వసూళ్ళకు పాల్పడ్డారని, ఆ క్రమంలో టీటీడీ ఆదాయానికి సైతం భారీగా గండి కొట్టారన్న ఆరోపణలున్నాయి. అవినీతి, అక్రమాలపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో గతేడాది ఆఖరులో టీటీడీ విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. ఈ విచారణలో రెవిన్యూ విభాగానికి చెందిన పలువురి నిర్వాకాలు వెలుగు చూశాయి. విజిలెన్స్ నివేదికలో టీటీడీ ఆదాయానికి గండి పడడానికి ప్రధాన బాధ్యత వారిదేనని వెల్లడైనా చర్యలు లేకుండానే ఈ ఏడాది ఎన్నికల దాకా మిన్నకుండిపోయింది టీటీడీ.

ప్రభుత్వం మారిన తర్వాతైనా ఇలాంటి వారికి కీలక విభాగం నుంచీ ఉద్వాసన పలుకుతారని వేచి చూసిన బాధితులకు నిరాశే మిగులుతోంది. ప్రస్తుత కీలక అధికారుల వద్ద కూడా ఈ వసూల్ రాజాలప్రభ ఏమాత్రం తగ్గలేదని, ఇప్పటికీ దుకాణాల దందా నిక్షేపంగా కొనసాగిస్తున్నారని ప్రక్షాళన కోసం నిరీక్షిస్తున్న వారు వాపోతున్నారు. పాలకపక్ష యువనేత రెడ్‌బుక్‌లో ఈ అధికారి పేరుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో రెడ్ బుక్‌లో పేరుంటే ఏమిటట.... కీలక అధికారులు తమకు క్లోజ్ అని, రాబోయే బోర్డు ఛైర్మన్‌కు కాబోయే పీఏలమంటూ కాలరెగరేస్తున్నారని సమాచారం. దీంతో ప్రభుత్వం మారినా ఉపయోగమేమిటంటూ కొండపై టీడీపీ శ్రేణులు సైతం నిట్టూరుస్తున్నాయి. - తిరుపతి, ఆంధ్రజ్యోతి





రెడ్‌బుక్‌లో పేరుంటే ఏమిటట... కొండపై వారిదే రాజ్యం!

తిరుమల రెవిన్యూలో అవినీతి తిమింగలాలు

టీటీడీలో తిరుమల పంచాయతీ అండ్ రెవిన్యూ విభాగం అత్యంత కీలకమైంది. తిరుమలలో నిర్మాణాలకు, మరమ్మతులకు ఈ విభాగమే అనుమతులు ఇవ్వాల్సి వుంటుంది. అలాగే దుకాణాలు, తట్టలుగా పిలిచే హాకర్ల నుంచీ టీటీడీకి అద్దెలు వసూలు చేసే విభాగమిది. తరచూ తనిఖీలు చేస్తూ దుకాణాలు, తట్టల నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘించకుండా పర్యవేక్షించడం కూడా ఈ విభాగం ప్రధాన బాధ్యత. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ విభాగ అధికారులు, ఉద్యోగులు కొందరు దుకాణాలను, హాకర్లను పర్యవేక్షించే పేరిట అక్రమ దందాలకు తెరలేపారనే ఆరోపణలున్నాయి. అనధికారిక దుకాణాలు, హాకర్ వ్యాపారాలను ప్రోత్సహించారని, టీటీడీకి చేరాల్సిన ఆదాయానికి గండి కొట్టి కొందరు పాలకమండలి ముఖ్యులకు మళ్ళించారనే ఆరోపణలున్నాయి. దాని మాటున తాము కూడా రూ. కోట్లకు పడగలెత్తారనే ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపై గతేడాది టీటీడీకి, ప్రభుత్వానికి విపరీతంగా ఫిర్యాదులు వెళ్ళాయి. ఆ క్రమంలో టీటీడీ గతేడాది జూన్‌లో విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దానికనుగుణంగా గత జూన్ 15 నుంచీ 27 వరకూ 13 రోజుల పాటు విజిలెన్స్ సిబ్బంది జీఎన్‌సీ, పీఏసీ 1, 2, 3... ఆర్టీసీ బాలాజీ బస్టాండు, సప్తగిరి, వీజీవో ఆఫీసు ఏరియా, ఎన్‌సీ 1, 2... లేపాక్షి ఎంపోరియం, లేపాక్షి అండర్ బ్రిడ్జి, ఎస్ఎన్‌సీ, టీబీసీ, హెచ్‌వీసీ, ఏఎన్‌సీ, ఏటీసీ, పాంచజన్యం, నందకం కేకేసీ, కళ్యాణ వేదిక, శ్రీవారి పాదాలు, మేదరమిట్ట, గుబ్బా సత్రం, శిలాతోరణం, వీఎస్‌జీహెచ్ ఏరియా, ఏటీఎస్, డీఎంబీ రోడ్డు, ఎస్ఎంసీ రోడ్డు, వైకుంఠం-1 క్యూలైన్ ఏరియా, ఎస్‌బీఐ రాగిమాను, ఎస్‌బీఐ ఏటీఎం, అన్నదానం వెలుపలికి వెళ్ళే గేటు, అన్నపూర్ణ క్యాంటీన్, డీఎంటీ, మోకాలిమిట్ట, షాపింగ్ కాంప్లెక్సు, షాపింగ్ కాంప్లెక్సు ఎక్స్ట్రా తట్టలున్న ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

విజిలెన్స్ తనిఖీల్లో దిమ్మదిరిగే అక్రమాలు

మొత్తం 667మంది హాకర్లను తనిఖీ చేస్తే అందులో 165 మంది హాకర్లు టీటీడీకి అద్దె చెల్లించడం లేదని విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు. అందులో 86 మందికి టీటీడీ జారీ చేసిన ప్రొసీడింగ్ కాపీలున్నాయి. కానీ వారు అద్దెలు చెల్లించకుండానే వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. 13 మంది వద్ద టీటీడీ జారీ చేసిన ప్రొసీడింగ్ కాపీలు కూడా లేవు కానీ ఆశ్చర్యకరంగా వారి వద్ద టీటీడీ హాకర్ ఐడీ కార్డులున్నాయి. వాటిని అడ్డుపెట్టుకుని వ్యాపారాలు చేసుకుంటున్నా టీటీడీకి అద్దెలు మాత్రం చెల్లించడం లేదు. 23మంది హాకర్లు దుకాణాల ఎదుట తట్టలు నడుపుతున్నారు. వారు టీటీడీకి అద్దెలు చెల్లించకుండా దుకాణదారులకు అద్దెలు చెల్లిస్తున్నారు. దుకాణాల ముందు వైపు వ్యాపారం చేసుకునేందుకు అనుమతించినందుకు దుకాణాల యజమానులు వీరి నుంచీ రోజువారీ అద్దెలు వసూలు చేసుకుని ఆదాయం పొందుతున్నారు.14 మంది ఇతరుల నుంచీ హాకర్ లైసెన్సులు కొనుగోలు చేసినట్టు స్టాంపు పత్రాలపై అగ్రిమెంట్లు రాసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. ఇందులో టీటీడీకి సమాచారం గానీ, అనుమతులు గానీ లేవు. మరో 29మంది తాము లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నామని, టీటీడీ పరిశీలనలో వున్నాయని చెబుతూ అద్దెలు చెల్లించకుండానే వ్యాపారాలు నడుపుతున్నారు. మొత్తం మీద 165 మంది హాకర్లు టీటీడీ నియమ నిబంధనలకు విరుద్ధంగా కొండపై అక్రమంగా వ్యాపారాలు నడుపుతున్నట్టు విజిలెన్స్ సిబ్బంది గుర్తించారు.

ఒక లైసెన్సుతో రెండు మూడు చోట్ల వ్యాపారం

విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో పలువురు హాకర్లు ఒకటికి రెండు చోట్ల వ్యాపారాలు సాగిస్తున్న వైనం వెలుగు చూసింది. ఉదాహరణకు 483, 248, 221, 312, 491, 321, 39, 55, 478, 480, 123-2006, 71, 40, 409, 425, 33 తదితర లైసెన్సు నంబర్లు కలిగిన హాకర్లు ఒక చోట వ్యాపారం నడుపుకునేందుకు లైసెన్సు తీసుకుని రెండేసి చోట్ల వ్యాపారం చేస్తున్నట్టు విజిలెన్స్ విభాగం గుర్తించింది. 423వ నంబరు లైసెన్సు కలిగిన హాకర్ అయితే ఏకంగా మూడు చోట్ల వ్యాపారం నడుపుతున్నట్టు గుర్తించారు. ఈ 17 మందిలో ఆరుగురు మాత్రమే తాము లైసెన్సు తీసుకున్న ఒక వ్యాపారానికి గానూ టీటీడీకి అద్దెలు కడుతున్నారు. మిగిలిన వారు అద్దె కూడా ఎగ్గొడుతున్నారు.

రెవిన్యూ విభాగం వైఫల్యాన్ని నిర్ధారించిన విజిలెన్స్ నివేదిక

హాకర్ల నుంచీ అద్దెలు సక్రమంగా వసూలు చేయడంతో రెవిన్యూ విభాగం విఫలమైందని విజిలెన్స్ విభాగం ఇచ్చిన నివేదికలో స్పష్టంగా వెల్లడించింది. మరోవైపు అక్రమాలను అరికట్టడంలో విఫలం కావడంతో టీటీడీ ఆదాయానికి గండి పడిందని పేర్కొంది. రెవిన్యూ విభాగంలో ఏఈవోలు భాస్కర నారాయణ చౌదరి, సత్రే నాయక్, సీనియర్ అసిస్టెంట్ మురుగేశన్, జూనియర్ అసిస్టెంట్ యుగంధర్ దీనికి బాధ్యులుగా విజిలెన్స్ విభాగం నివేదికలో నిర్ధారించింది. వీరు సక్రమంగా తనిఖీలు చేయడం లేదని, అద్దెలు వసూలు చేయడం లేదని, అక్రమాలను గుర్తించి చర్యలు తీసుకోలేదని నివేదికలో పేర్కొంది. తిరుమలలో అక్రమ వ్యాపారాలకు సంబంధించి రెవిన్యూ విభాగం ఏఈవో ఒకరు తెర వెనుక కీలక పాత్ర పోషిస్తున్నట్టు పేర్కొంది. అయితే ఆ అధికారి ఎవరన్నది స్పష్టంగా తెలిసినా, కొండపై వ్యాపారవర్గాల్లో బహిరంగ రహస్యమే అయినా విజిలెన్స్ ఆ అధికారి వివరాలు వెల్లడించడానికి మొహమాటపడినట్టు సమాచారం. అందుకే నివేదికలో.... హాకర్ల వర్గాలలో రెవిన్యూ విభాగానికి సంబంధించిన ఓ ఏఈవో స్థాయి అధికారి "కింగ్‌పిన్"గా వ్యవహరిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది...అని మాత్రమే వ్యాఖ్యానించి వదిలిపెట్టేసింది.

రూ. కోట్లు కొల్లగొడుతున్న తెర వెనుక తిమింగలం

టీటీడీ తిరుమల రెవిన్యూ విభాగంలో పేరుకు ఏఈవో అయినప్పటికీ రూ. కోట్లు కొల్లగొడుతున్నారనే ఆరోపణలున్నాయి. 1990వ దశకం తొలినాళ్ళలో జూనియర్ అసిస్టెంట్‌గా టీటీడీలో ప్రవేశించిన ఆ ఉద్యోగి అంచెలంచెలుగా ఇపుడు ఏఈవో స్థాయికి చేరుకున్నారని, ఆ క్రమంలో అనేక విభాగాల్లో పనిచేసి తీవ్ర అవినీతి ఆరోపణలు మూటగట్టుకున్నారని కొండ మీద ప్రచారం జరుగుతోంది. గతంలో రెండు సార్లు బోర్డు ఛైర్మన్‌గా పనిచేసిన ఒకరి వద్ద పీఏగా పనిచేసి దర్శనాల టికెట్లు, గదుల కేటాయింపుల్లో భారీగా అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ముఖ్యంగా గత వైపీపీ ప్రభుత్వంలో సైతం వైవీ సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా వుండగా ఆయన కార్యాలయంలో కొంతకాలం పనిచేశారని, ఆ పలుకుబడి ఉపయోగించి రెవిన్యూ విభాగంలో తిష్ట వేశారని టీటీడీ వర్గాలు చెబుతున్నాయి. గత పాలకమండలిలో ఓ ముఖ్యనేత తనకు అవసరమైన వారికి 30 మందికి అనధికారికంగా తట్టలు పెట్టించాలని హుకుం జారీ చేయగా దాన్ని అడ్డుపెట్టుకుని ఈ అధికారి ఏకంగా 300 దాకా అక్రమ తట్టలు పెట్టించేశారని సమాచారం. ముఖ్యనేత సిఫారసు కలిగిన తట్టల వ్యాపారుల నుంచీ రూ. 20లక్షల వంతున వసూలు చేసి పెట్టారని, అలాగే దుకాణాలు, తట్టలను ఒకచోట నుంచీ మరోచోటికి మార్పించే ప్రక్రియకు సంబంధించి కూడా భారీ మొత్తాలు వసూలు చేసి ముఖ్యనేతకు ముట్టజెప్పారని సమాచారం. తాను సొంతంగా పెట్టించిన అనధికార తట్టల వ్యాపారుల నుంచీ తొలుత భారీ మొత్తాలు రాబట్టుకున్నారని, అనంతరం నెలవారీ అద్దెలు తానే వసూలు చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. అదనంగా ముట్టజెప్పే వారు ఒక లైసెన్సుతో రెండు మూడు చోట్ల వ్యాపారాలు చేసుకునేందుకు అనుమతిస్తున్నారని సమాచారం. పాలకమండలి కీలక నేత అక్రమార్జన ఒక్కసారికి పరిమితం కాగా ఈ అధికారి అక్రమార్జన దానికి పలు రెట్లు అధికంగా నెలనెలా కొనసాగుతోందన్న ఆరోపణలున్నాయి.

తండళ్ళలోనూ తిమింగలానికే భారీ లబ్ధి

తిరుపతి, తిరుమలలో వ్యాపార వర్గాల్లో విస్తృత ప్రచారంలో వుండే వ్యాపారం తండల్. వ్యాపార అవసరాల కోసం వడ్డీ వ్యాపారుల నుంచీ అప్పుగా తీసుకుని రోజువారీ లేదా వారం వారం కంతులు చెల్లించడమే తండల్. తిరుమల కొండపై హాకర్ లైసెన్సులు కలిగిన వారు, అనధికారికంగా వ్యాపారం చేసుకునే హాకర్లు మొత్తం రెవిన్యూ విభాగంలో పనిచేసే తిమింగలం గుప్పిట్లో చిక్కుకుని వున్నారనే ఆరోపణలున్నాయి. తిరుమల కొండపై తండల్ ఇచ్చే ఓ పేరుమోసిన వడ్డీ వ్యాపారి ఈ అవినీతి అధికారికి సన్నిహితుడు కావడంతో ఈ అధికారి తన డబ్బునే వడ్డీ వ్యాపారి ద్వారా హాకర్లకు అప్పుగా ఇప్పిస్తున్నాడని చెబుతున్నారు. హాకర్లను ఒత్తిడి చేసి వారితో తన స్నేహితుడి వద్ద అప్పు తీసుకునే చేస్తున్నారని, అలా తీసుకోని వారిని తనిఖీలు, జరిమానాల పేరిట వేధించుకుతింటున్నారని సమాచారం. హాకర్లకు ఇచ్చిన రుణాల మొత్తం రూ. 10 కోట్లకు పైబడి వుంటుందని, దానికి రోజువారీ లేదా వారం వారం వసూలు చేసే వడ్డీలు కూడా భారీగానే వుంటున్నాయని సమాచారం. ఈ దందాలో ఎన్నికల ముందు వరకూ పాలకమండలి ముఖ్యనేతకు, అప్పటి కీలక అధికారికి వాటాలు సమర్పించేవారనే ఆరోపణలున్నాయి. మరో అధికారికి తిరుపతి నగరం కరకంబాడి రోడ్డులో ఏకంగా ఇల్లే కొని బహుమతిగా ఇచ్చారని సంబంధిత విభాగాల్లో ప్రచారం జరుగుతోంది.


విజిలెన్స్ విచారించి దోషిగా తేల్చినా చర్యలేవీ?

రెవిన్యూ విభాగం వైఫల్యం కారణంగానే కొండమీద తట్టల ఏర్పాటు, నిర్వహణల్లో అక్రమాలు జరుగుతున్నాయని విజిలెన్స్ విభాగం నివేదికలో తేల్చినా అవినీతి తిమింగలంపై ఇప్పటి వరకూ చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. కొందరిని సంబంధిత విభాగం నుంచీ ఇతర విభాగాలకు బదిలీ చేసినా తెర వెనుక కీలక పాత్ర వహిస్తున్న అధికారిని, ఆ అధికారికి సహకరిస్తున్న సిబ్బందిని మాత్రం నిక్షేపంగా కొనసాగిస్తున్నారు. టీటీడీ ముఖ్య అధికారి వద్ద ఈ అవినీతి అధికారే ఇపుడు హల్ చల్ చేస్తుండడం పట్ల టీటీడీ వర్గాలే విస్తుపోతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి పాలకమండలి ముఖ్యులతో, వైసీపీ కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడిన ముఖ్య అధికారితో అంటకాగిన వ్యక్తి ప్రభుత్వం మారాక కూడా అదే స్థానంలో కొనసాగుతూ తన హవా నడుపుతుండడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. టీటీడీ నుంచే రాష్ట్ర పాలనను ప్రక్షాళన చేస్తామని సాక్షాత్తూ సీఎం చంద్రబాబు తిరుమలలోనే వ్యాఖ్యానించిన నేపథ్యంలో అవినీతికి పేరుమోసిన అధికారి కీలక విభాగంలో కొనసాగుతుండడాన్ని టీడీపీ వర్గీయులు సైతం ప్రశ్నిస్తున్నారు. గత పాలకమండలి ముఖ్యులకు భారీగా ఆక్రమార్జన రుచి చూపించిన ఈ అధికారి పేరు టీడీపీ యువనేత నారా లోకేశ్ రెడ్ బుక్‌లో కూడా నమోదై వుందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో తన సామాజికవర్గం కారణంగా బుక్‌లో పేరున్నా తనకేమీ కాదని, కొత్తగా ఏర్పడే పాలకమండలిలో ఛైర్మన్ ఎవరైనా వారికి పీఏగా వ్యవహరించేది తానేనంటూ టీటీడీలో ఇతర అధికారులను కూడా సదరు తిమింగలం హడలగొడుతున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ప్రక్షాళన తిరుమల పంచాయతీ మరియు రెవిన్యూ విభాగం నుంచే మొదలు పెట్టాలన్న డిమాండ్ పలు వర్గాల నుంచీ వినిపిస్తోంది.

'పెద్దిరెడ్డి' గేట్లు తెరుచుకున్నాయ్

కొత్త కమిషనర్ మౌర్య సీరియస్

రోజూ ఉదయం, సాయంత్రం గేట్లు తెరిచివున్నట్టు ఫొటోలు పెట్టాలంటూ ఆదేశం



తిరుపతి, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ కీలక నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ఎట్టకేలకు దిగివచ్చారు. కార్పొరేషన్ వేసిన రోడ్లకు ఆయన ఇంటి ముందు సామాన్య ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించకుండా రెండు వైపులా ఏర్పాటుచేసిన గేట్లను హైకోర్టు ఆదేశాల మేరకు అధికారులు ఆలస్యంగా అయినా తెరిచారు. గురువారం మధ్యాహ్నం గేట్లు తెరుచుకోవడంతో పలువురు రాకపోకలు సాగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో స్థానిక 18వ డివిజన్లోని తన ఇంటికి కార్పొరేషన్ నిధులతో రోడ్లు వేయించుకున్నారు. 'మంత్రిగారి పెరట్లో మునిసిపాలిటీ రోడ్డు' శీర్షికన 2020 సెప్టెంబరు 30న ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. అధికారం చేతిలో ఉంది కాబట్టి ఆ రోడ్డును స్థానిక ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు యంత్రాంగం ముందుకు రాలేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెద్దిరెడ్డి రోడ్డు బాగోతాన్ని ఆంధ్రజ్యోతి మళ్లీ తెరపైకి తీసుకొచ్చింది. రోడ్డు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేషన్ కమిషనర్‌కు టీడీపీ నేతలు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో జనసేన పార్టీ నేత కిరణ్ రాయల్ జనసైనికులతో కలిసి పెద్దిరెడ్డి ఇంటిముందు ధర్నాకు దిగిన నేపథ్యంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మున్సిపల్ అధికారులను నివేదిక కోరడంతో అవి కార్పొరేషన్ నిధులతో వేసిన రోడ్లేనని తేలింది. ఈక్రమంలో పెద్దిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఈనెల 8న హైకోర్టును ఆశ్రయించారు. పిటీషనర్ల ప్రైవేట్ ఆస్తి వ్యవహారంలో ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఆదేశిస్తూ 10వ తేదీకి కేసును వాయిదా వేశారు.దీనిపై 10వ తేదీ ప్రభుత్వ న్యాయవాది రిట్‌పిటీషన్ దాఖలు చేయగా ప్రజా రవాణాకు ఇబ్బంది కలగకుండా, గేట్లు మూసివేయకుండా చూడాలని 8వ తేదీ ఇచ్చిన ఉత్తర్వును సవరిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ప్రతివాదులకు కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయడానికి 4 వారాలకు వాయిదావేసింది.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

● హైకోర్టు ఆదేశించినా కార్పొరేషన్ మౌనవ్రతం

హైకోర్టు ఆదేశాల మేరకు తదుపరి తీర్పు వచ్చేవరకు పెద్దిరెడ్డి ఇంటి ముందు రెండు కాలనీలకు దారి కల్పించాలని 10వ తేది కోర్టు ఇచ్చిన ఆదేశాలు ఈనెల 15న మున్సిపల్ కార్పొరేషన్‌కు ఉత్తర్వులు అందాయి. పిటీషనరైన పెద్దిరెడ్డి గేట్లు తెరవని నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలను అమలుచేయాల్సిన బాధ్యత కార్పొరేషన్‌పై ఉంది. అలాంటి చర్యలు ఏమీ తీసుకోకపోవడంతో గురువారం ఆంధ్రజ్యోతిలో హైకోర్టు ఆదేశాలను ప్రచురించింది. దీంతో బాధ్యతలు చేపట్టిన కొత్త కమిషనర్ నారపరెడ్డి మౌర్య అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. గేట్లు తెరిచి, ప్రజల రాకపోకలకు అవకాశం కల్పించాలని, రోజూ ఉదయం, సాయంత్రం గేట్లు తెరిచిన ఫొటోలు తనకు పంపించాలని అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. దీంతో పెద్దిరెడ్డి ఇంటి వద్దకు పరుగులు తీసిన సిబ్బంది ఎట్టకేలకు గేట్లను తెరిచారు. దీంతో రాయల్ నగర్- మారుతీనగర్ వాసులకు రోడ్డు అందుబాటులోకి రావడంపై జనసేన నేత కిరణ్ రాయల్ హర్షం వ్యక్తం చేశారు.

కోస్టల్ కారిడార్ భూసర్వే ప్రారంభం



కోట, జూలై 25 : చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్ భూములకు సంబంధించి భూసర్వే గురువారం ప్రారంభమైంది.కోట మండలంలోని కొత్తపట్నం రెవిన్యూ పరిధిలో డిప్యూటీ తహసీల్దారు హరికృష్ణ,వీఆర్వో శ్రీనివాసులు ఆధ్వర్యంలో సర్వేను ప్రారంభించారు. కోస్టల్ కారిడార్ భూములకు తీసుకునే 444 ఎకరాల్లో సాగవుతున్న పంటలను, ఏ రైతు ఏ మేరకు పంట సాగు చేశారనే వివరాలను ఈ సర్వేలో సేకరించనున్నారు.భూములు కోల్పోయే రైతులకు పరిహారం పంపిణీ చేసేందుకు కొత్తపట్నంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు.భూములన్నీ దాదాపుగా ప్రభుత్వ భూములే అయినప్పటికీ పలువురు సన్నకారు రైతులు జీడిమామిడి, వేరుశనగ పండిస్తున్నారు.ఆయా భూములకు సంబంధించిన పరిహారం ఇవ్వాలని వారు కోరుతున్నారు.

ఆ భూముల లెక్కలు తీయండి

● మూడు నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూములు భారీగా అన్యాక్రాంతం ● సమగ్ర నివేదిక ఇవ్వాలన్న సిసోడియా

తిరుపతి(కలెక్టరేట్), జూలై 25: గడిచిన ఐదేళ్లలో తిరుపతి జిల్లాలో భారీగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయని,వాటిపై సమగ్ర నివేదిక ఇవ్వాలని రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం రాత్రి రికార్డులను తగులబెట్టిన ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది.గురువారం సబ్‌కలెక్టరేట్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 60 మండలాల తహసీల్దార్లతో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో సిసోడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీకాళహస్తి, చంద్రగిరి,తిరుపతి నియోజకవర్గాల పరిధిలో అత్యధికంగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనట్లు ఫిర్యాదులందాయని చెప్పారు. వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను సిసోడియా ఆదేశించినట్లు సమాచారం. ముఖ్యంగా తిరుపతి నగరంలో అసైన్డ్ భూములను క్రమబద్ధీకరించే పేరుతో భారీఎత్తున అక్రమాలు జరిగాయన్నారు. అలా ఎన్ని ఎకరాలు రిజిస్ట్రేషన్ అయ్యాయి, 22ఏ భూముల విస్తీర్ణం ఎంత, వాటిలో ఎన్ని కన్వర్షను అయ్యాయి, ఇనాం భూముల పరిస్థితిపై క్షుణ్ణంగా నివేదిక ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. చంద్రగిరిలో చుక్కల భూములు అన్యాక్రాంతం కావడంపై నివేదిక ఇవ్వాలన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు, రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో అప్పటి తహసీల్దార్లు నియోజకవర్గ ప్రజాప్రతినిధికి అప్పనంగా ప్రభుత్వ భూములను కట్టబెట్టినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా నివేదిక ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంతో ఇద్దరు తహసీల్దార్లు కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారన్న సమాచారం ఉందని, వారి పరిస్థితిపై కూడా సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు. సిసోడియా ఆదేశాల ప్రకారం సమగ్రంగా విచారిస్తే తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో పలువురు తహసీల్దార్లు సస్పెండ్ కావడంతో పాటు ముందుండి కథ నడిపించిన వైసీపీ నాయకులు జైలుకు వెళ్లే పరిస్థితి ఖాయమంటూ రెవెన్యూ అధికారుల్లో కలవరం మొదలైంది.



రెవిన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియాతో తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు

12 కిలోల మారవ చేప



చిత్తూరు జిల్లా సదుంలోని కుమారుని ఒడ్డు చెరువులో గురువారం 12 కిలోల మారవ చేప దొరికింది. ఇక్కడి జాలర్ల వలకు ఈ పెద్ద చేప చిక్కింది. దీనిని స్థానికులు ఆసక్తిగా చూశారు. చెరువులో నీళ్ల మరింత తగ్గితే ఇంకా పెద్ద చేపలు దొరుకుతాయని తెలిపారు. - సదుం

సివిల్ కేసులో జోక్యం

● వీఆర్‌కు భాకరాపేట ఎస్ఐ

భాకరాపేట/తిరుపతి(నేరవిభాగం), జూలై 25: సివిల్ కేసులో జోక్యం చేసుకున్న భాకరాపేట ఎస్ఐ విజయకుమార్‌ను వేకెన్సీ రిజర్వుకు పంపుతూ ఎస్పీ సుబ్బరాయుడు ఉత్తర్వులు జారీ చేసారు.చిన్నగొట్టిగల్లులో ఓ ఇంటిని ఖాళీ చేయించే విషయంలో ఎస్ఐ విజయకుమార్ జోక్యం చేసుకోవడంతో బాధితురాలు నేరుగా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.దీంతో ఆయన విచారణ జరిపించగా ఎస్ఐ జోక్యం చేసుకున్న విషయం నిర్ధారణ కావడంతో క్రమశిక్షణా చర్యల కింద వీఆర్‌కు పంపుతూ ఉత్తర్వులు జారీ చేశారు.పోలీసులు ఎవరైనా సివిల్ తగాదాల్లో తలదూర్చితే చర్యలు తీవ్రంగా వుంటాయని ఎస్పీ ఓ ప్రకటనలో హెచ్చరించారు.

గ్రామీణ విద్యార్థికి ఐఐటీ సీటు



ఉదయ్‌కుమార్

పెళ్లకూరు, జూలై 25: మండలంలోని మారుమూల ప్రాంతానికి చెందిన పేదింటి విద్యార్థికి ఐఐటీలో సీటు దక్కింది. చెన్నప్పనాయుడుపేటలో దళిత సామాజికవర్గానికి చెందిన మల్లాం వెంకటరమణ, రమణమ్మ దంపతుల కుమారుడు ఉదయ్‌కుమార్ జాతీయ స్థాయిలో జూన్ 9న వెలువడిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్సీ కేటగిరిలో 2045 ర్యాంకు సాధించాడు. దీంతో జూన్ 23న ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ ఐఐటీలో బీటెక్‌లో సీటు కేటాయించారు. ఈనెల 29న కళాశాలలో చేరాల్సి ఉంది. కాగా వెంకటరమణయ్య ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ... సివిల్స్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించి పేదలకు సేవ చేయాలని ఉందన్నారు.

ఉద్యోగాలెలా చేస్తారో చూస్తాం!

- టీడీపీ నేతల బెదిరింపులు
- బాలాయపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కన్నీరు

బాలాయపల్లి, జూలై 25: ఉద్యోగాలు ఎలా చేస్తారో చూస్తాం అంటూ మండలంలోని సుబ్రమణ్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వైద్యాధికారిపై ఆగ్రహించిన సంఘటన గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు... మండలంలోని సుబ్రమణ్యం గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త కృష్ణవేణిని తొలగించాలని టీడీపీ నేతలు డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో కృష్ణవేణి పనితీరుపై విచారించి నివేదిక పంపాలని ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చినా ఎందుకు పంపలేదంటూ టీడీపీ నాయకుడితో పాటు మరి కొందరు గురువారం మధ్యాహ్నం వైద్యాధికారి ప్రమీలను ప్రశ్నించారు. హార్డ్ కాపీ ఇంకా ఎందుకు పంపలేదంటూ ఆమెతో వాగ్వాదానికి దిగి ఉద్యోగాలు ఎలా చేస్తారో చూస్తాం, ఆరోగ్యకేంద్రానికి తాళాలు వేస్తాం, అంటూ బెదిరించారు. దీంతో భయభ్రాంతులకు గురైన వైద్యాధికారి స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇద్దరు కానిస్టేబుళ్ల సమక్షంలో ఆమె మాట్లాడుతూ... రోజువారీ కార్యక్రమాల కారణంగా నివేదిక పంపడం ఆలస్యమైందని చెప్పారు. అయినప్పటికీ పట్టించుకోకుండా అసభ్య పదజాలంతో దూషించారంటూ కన్నీరుమున్నీరయ్యారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం: సీపీఎం



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

గూడూరు, జూలై 25: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి కేటాయింపుల్లో అన్యాయం జరిగిందని సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం టవర్ క్లాక్ సెంటర్ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో వారు మాట్లాడుతూ... కేంద్ర బడ్జెట్ పెట్టుబడిదారులకు కొమ్ముకాసేలా ఉందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15 వేల కోట్లు అప్పుగా ప్రకటించడం దుర్మార్గపు చర్య అన్నారు. దీన్ని గ్రాంట్‌గా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా మన్నారు. విభజన హామీ చట్టంలోని ప్రత్యేక హోదా అంశాన్ని గాలికి వదిలేశారన్నారు. ప్రత్యేక ప్యాకేజీని కానీ, నిధులను కానీ ప్రకటించకుండా ఆంధ్ర ప్రజలను మోసం చేశారన్నారు. విశాఖపట్నం రైల్వేజోన్, కడప స్టీల్ ఫ్యాక్టరీ, రామాయపట్నం ఓడరేవు నిర్మాణం ఊసే లేదన్నారు. నిరసన కార్యక్రమంలో శివకుమార్, శ్రీనివాసులు, బీవీ రమణయ్య, సురేష్, శంకరయ్య, చంద్రయ్య, మున్నా తదితరులు పాల్గొన్నారు.

పార్టీ జాతీయ అధికార ప్రతినిధితో గూడూరు జనసేన నాయకుల భేటీ



గూడూరు, జూలై 25: జనసేన పార్టీ జాతీయ అధికార ప్రతినిధి వి.అజయ్ కుమార్‌ను గురువారం మంగళగిరి లోని పార్టీ కార్యాలయంలో గూడూరు జనసేన నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... గూడూరు నియోజకవర్గ పరిధిలో జనసేన బలోపేతానికి, సభ్యత్వనమోదు వేగవంతానికి చర్యలు తీసుకోవాలని... క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించి ప్రజలకు పార్టీని చేరువ చేసేలా కృషి చేయాలని ఆయన సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంద్రవర్ధన్, చంద్రనీల్, వెంకటకిరణ్, రాజశేఖర్, కోటి, అవినాష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట సాగు హక్కుదారు పత్రాల పంపిణీ




కార్డులను అందిస్తున్న ఏవో భవాని

చిల్లకూరు, జూలై 25: మండలంలోని కడివేడు గ్రామంలో సాగులో ఉన్న వరిని గురువారం వ్యవసాయశాఖ అధికారి భవాని పరిశీలించారు. అనంతరం కౌలు రైతులకు పంట సాగు హక్కుదారుల పథక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... మండలంలో ప్రస్తుతం పంట చిరు పొట్ట దశలో ఉందన్నారు. ఈ దశలో ఎక్కువగా ఆకుముడత తెగులు ఆశిస్తుందన్నారు. రసాయనిక మందుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ మందులను తగిన మోతాదులో వినియోగించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను ప్రోత్సహించడం నేరం

గూడూరు అర్బన్, జూలై 25: బాల్యవివాహాలను ప్రోత్సహించడం నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివజ్యోతి అన్నారు. గురువారం చెన్నూరు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సును నిర్వహించి ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు నేరమన్నారు. ఎవరైనా బాల్యవివాహలను ప్రోత్సహిస్తే సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సిద్దయ్య, విజయలక్ష్మి, రమణమ్మ, భువనేశ్వరి, లక్ష్మి, పావని తదితరులు పాల్గొన్నారు.

చదువులపై శ్రద్ధ చూపండి



గూడూరు అర్బన్, జూలై 25: విద్యార్థినులు చిన్నతనం నుంచే చదువులపై శ్రద్ధచూపి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రోటరీక్లబ్ సభ్యులు అన్నారు. గురువారం నరసింగారావుపేటలోని బాలసదనంలో అశోక్‌చక్రవర్తి దాతృత్వంతో విద్యార్థినులకు గొడుగులను అందజేశారు. శ్రీధర్‌రెడ్డి, గోపాల్‌నాయుడు, అశోక్‌చక్రవర్తి, మునిగిరీష్, దశరథరామిరెడ్డి, కృష్ణయ్య, రాంప్రసాద్, కిరణ్‌చక్రవర్తి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

చిల్లకూరు, జూలై 25: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో రవూఫ్ అన్నారు. గురువారం మండలంలోని తిమ్మగారిపాళెం సమీపంలోని వివిధ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికుల పిల్లలను బడిలో చేర్పించి వారికి స్టూడెంట్ కిట్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సుమారు 20 మంది పిల్లలను పాఠశాలలో చేర్పించామన్నారు. హెచ్‌ఎం చెంచయ్య, రామ్మోహన్, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పచ్చని చెట్లపై వేటు... వాల్టాకు తూట్లు!

యథేచ్ఛగా కలప తరలింపు ● మొద్దునిద్రలో అటవీశాఖ, రెవెన్యూ అధికారులు



పట్టపగలే డిపోలకు తరలిస్తున్న దుంగలు

వెంకటగిరి టౌన్, జూలై 25: కలపను అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. కళ్లెదుట పచ్చని చెట్లను నరికి యథేచ్ఛగా తరలిస్తున్నా సంబంధిత శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండంతో అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతోంది. వన మహోత్సవం పేరిట అటవీ శాఖ మొక్కలు నాటి సంరక్షిస్తుండగా, మరో వైపు అక్రమార్కులు చెట్లను నరికేస్తున్నా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ వృక్షాలను నరికి కలపను అధిక శాతం టింబర్ డిపోలకే తరలిస్తున్నారు. వెంకటగిరిలో మూడు టింబర్ డిపోలున్నాయి. నెలకు 30ట్రాక్టర్ల కలపను ఇక్కడికి తీసుకుని వస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి బొగ్గుల బట్టీకి నెలకు 10టన్నుల వరకు కలప తరలించేందుకు అనుమతులున్నాయి. ఈ నిబంధనలేవీ అమలు కావడం లేదని వాల్టా చట్టానికి తూట్లు పడుతున్నాయని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో అటవీ శాఖ అధికారులు పర్యవేక్షణ కొరవడిందని దీంతో పట్టపగలే పెద్దపెద్ద చెట్లు నరికి టింబర్ డిపోలకు తరలిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. కొందరు తమ చెట్లేనని విక్రయిస్తున్నారు. అయితే సంబంధిత అధికారుల నుంచి వాల్టా చట్టం ప్రకారం అనుమతి తీసుకోకుండా నరికేస్తున్నారు. గతంలో గుట్టుచప్పుడు కాకుండా రాత్రి వేళ తరలించేవారు. ఇప్పుడు పట్టపగలే తమ పని కానిచ్చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

చెట్లమాటున ఎర్ర బంగారం...

ఇలా నరికి తెస్తున్న కలప మాటున కొందరు ఎర్రచందనం అక్రమణ రవాణా చేస్తున్నట్లు సమాచారం. దీంట్లో అధికారుల హస్తం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. జూన్ 29న వెంకటగిరి నియోజకవర్గం పెంచలకోనలో భారీ స్థాయిలో ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నారు. జూలై 25న రాపూరు అడవుల్లో దాడులు నిర్వహించగా ఎర్రచందనం లభ్యమైందని అధికారులు వివరించారు.

దాడులు నిర్వహిస్తున్నాం...

చెట్లను నరికి వేస్తు అక్రమంగా తరలించే సమయాల్లో దాడులు నిర్వహిస్తున్నాం. ఆరు నెలల్లో అక్రమంగా తరలిస్తున్న కలపపై రూ.40వేలు జరిమానా వసూలు చేశాం. ప్రతి డిపోపై కేసులు నమోదు చేసి, జరిమానా విధించాం. అక్రమ రవాణా అరికట్టేందుకు రాత్రిళ్లు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

\- రాజేంద్రప్రసాద్, అటవీ శాఖ రేంజర్

ఆర్‌అండ్‌బీ రోడ్లు ఛిద్రం

అవస్థలు పడుతున్న వాహన చోదకులు ● పట్టించుకోని అధికారులు





మేనకూరు సెజ్ - మనవాలి రోడ్డులో గుంతలు - చిల్లమానుచేను వద్ద గుంతలమయమైన ఆర్‌అండ్‌బీ రోడ్డు

ఓజిలి, జూలై 25: మండలంలోని పలు ఆర్‌అండ్‌బీ రోడ్లు ఛిద్రమయ్యాయి. మండలంలో వివిధ మార్గాల్లో 100 కిలోమీటర్ల మేరకు ఈ రోడ్లు విస్తరించి ఉన్నాయి. ఆయా రోడ్లపై సామర్థ్యానికి మించిన భారీ వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుండడంతో రూపురేఖలు కోల్పోతున్నాయి. మండలంలోని పెద్దపరియ రైల్వే అండర్ బ్రిడ్జినుంచి చిల్లమానుచేను వరకు ఉన్న 8 కిలోమీటర్ల రోడ్డు గుంతలమయమైంది. ముఖ్యంగా చిల్లమానుచేను చిల్లమానుచేను నుంచి ఇనుగుంట వరకు, అలాగే రజానగరం నుంచి కోనేటి రాచపాళెం వరకు రోడ్డు దుస్థితిలో ఉంది. చిల్లమానుచేను నుంచి భువనగిరిపాళెం వరకు, అరిమేనిపాడు నుంచి మొండికట్లరాజుపాళెం మీదుగా వీర్లగునుపాడు రోడ్డుదీ అదే పరిస్థితి. ఓజిలి నుంచి కురుగొండ, ఓజిలి సబ్‌స్టేషను నుంచి వెంకటరెడ్డిపాళెం, కొండవల్లిపాడు మీదుగా మానమాల రోడ్డు కూడా ఛిద్రమైంది. ఆటోలు, ద్విచక్ర వాహన చోదకులు ఈ రోడ్లపై రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ మార్గాల్లో గుంతలకు కనీస మరమ్మతులు చేపట్టలేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సెజ్ రోడ్డుకూడా...

నాయుడుపేట మండలం మేనకూరు సెజ్ రోడ్డు కూడా ఇదే దుస్థితిలో ఉంది. మేనకూరు సెజ్ మీదుగా ఓజిలి మండలం మనవాలికి ఉన్న 4 కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా రూపు కోల్పోయింది. ఈ మార్గం పంచాయతీరాజ్ శాఖ పరిధిలోకి చేరడంతో అప్పట్లో వేసిన తారు రోడ్డు అక్కడక్కడ కనిపిస్తోంది. ముఖ్యంగా గ్రామానికి సమీపంలోని చెరువు కట్ట ప్రాంతంలో మట్టి కరిగిపోయి రోడ్డు మీదకు రావడంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి.

పట్టించుకోని అధికారులు

మండలంలోని ఆర్‌అండ్‌బీ రోడ్లు ఛిద్రమైపోతున్నా ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఎప్పటికప్పుడు రోడ్లకు మరమ్మతులు చేపట్టకపోవడంతోనే ఈ దుస్థితి దాపురించిందని గ్రామీణులు అంటున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఓజిలి మండల ఏఈ చెన్నరాయుడు మాట్లాడుతూ... మరమ్మతుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపామన్నారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్ల నిర్వహణ, మరమ్మతుల బిల్లులు ఇప్పటికీ మంజూరు కాకపోడంతో పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్లకు ముందుకు రావడంలేదన్నారు. ఓజిలిలోనే కాదు దాదాపు అన్ని మండలాల్లో ఆర్‌అండ్‌బి రోడ్ల పరిస్థితి ఇలానే ఉందన్నారు. నూతన ప్రభుత్వం చర్యలు తీసుకుని నిధులు సమకూర్చిన వెంటనే మరమ్మతులు చేపడుతామన్నారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం

- పట్టించుకోని అధికారులు



మేల్చూరులో నిర్మాణంలో ఉన్న కట్టడం

బాలాయపల్లి, జూలై 25: ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనా సంబంధిత అధికారులు నిద్ర నటిస్తున్నారు. మండలంలోని మేల్చూరులో సర్వే నెం.8లో గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి 5 సెంట్లు భూమికి పట్టా ఇవ్వగా మరో ఇరవై సెంట్లు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుండడంతో గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై వివాదం తలెత్తి ఒకరు హత్యకు గురయ్యారు. దీంతో నిర్మాణాలు నిలిపేశారు. ఈ క్రమంలో గత రెండ్రోజులుగా నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రభుత్వ స్థలం ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు మండిపడుతున్నారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రూ.56 లక్షలతో గురుకులంలో అభివృద్ధి పనులు

నాయుడుపేట, జూలై 25: పట్టణంలోని ఎల్ఎసాగరంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో రూ.56 లక్షలతో అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు గురుకుల ప్రిన్సిపాల్ దాదాపీర్ తెలిపారు. గురుకులంలో గురువారం ఆయన మాట్లాడుతూ... ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈ సొసైటీ రూ.25 లక్షలు మంజూరు చేసిందన్నారు. తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్ రూ.31 లక్షలను మంజూరు చేశారన్నారు. వసతి గృహం-1లో మరుగుదొడ్ల మరమ్మతులు, టైల్స్, తలుపులు, నీటి సరఫరా, డైనింగ్‌హాల్‌లో కిటికీలు, ఫ్యాన్లు, లైట్‌ల ఏర్పాటు, వంటగదిలో ఫ్లోరింగ్, వసతి గృహం-2కి వెళ్లే దారికి ర్యాంప్ నిర్మిస్తున్నట్లు తెలిపారు.

29నుంచి ఇంటర్, టెన్త్ తరగతులు ..

సోమవారం నుంచి ఇంటర్మీడియెట్, టెన్త్ తరగతులను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఆమేర విద్యార్థులు వారి తల్లిదండ్రులు గురుకులానికి సకాలంలో రావాల్సి ఉంటుందన్నారు. మరో వారం తరువాత 6 నుంచి 9 తగరతుల విద్యార్థులకు తరగతులుంటాయన్నారు. ఆయన వెంట వైస్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, మున్సిపల్ ఏఈ చంద్రమోహన్‌లు ఉన్నారు.

కాలువల్లో కదలని మురుగు



మురుగుతో నిండిపోయిన సిమెంట్ రోడ్డు

నాయుడుపేట, జూలై 25: పట్టణంలో పారిశుధ్యం జాడ కానరావడం లేదు. మురుగునీటి కాలువలు ముందుకు సాగడం లేదు. ఎక్కడికక్కడ రోడ్లపై మురుగు పారుతోంది. దీంతో దోమల ఉత్పత్తి పెరిగి పట్టణ వాసులు ఇబ్బంది పడుతున్నారు. నాయుడుపేట పాత ట్రెజరీ కార్యాలయం ఎదుట ఉన్న సిమెంట్ రోడ్డు పక్కన మురుగునీటి కాలువలో గత కొన్ని రోజులుగా మురుగు పారుదల లేక నిల్వ చేరింది. అది కాస్తా రోడ్డుపైకి చేరింది. దీంతో దుర్గంధం వెదజల్లడమేకాకుండా దోమలకు ఆవాసమైంది. రోజులతరబడి మురుగు నిల్వచేరినా పారిశుధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదు. ఇకనైనా మున్సిపల్ కమిషనర్ చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

సాగులో మెలకువలు పాటించండి




సుగ్గుపల్లిలో వరి పైరు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

సూళ్లూరుపేట, జూలై 25: సాగులో మెలకువలు పాటించాలని సూళ్లూరుపేట వ్యవసాయ సహాయ సంచాలకులు అనిత అన్నారు. గురువారం మండల పరిధిలోని సుగ్గుపల్లి, సుద్దమడుగు తాగేలి, ఇలుపూరుల్లో సాగులో ఉన్న వరి, వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రస్తుతం మండలంలో వరి పొట్ట దశలో ఉందని దోమపోటు సోకే అవకాశం ఉందన్నారు. పొలాల్లో నీటి నిల్వ తగిన మోతాదులో ఉండాలన్నారు. అధికారుల సలహా మేరకు తగిన మోతాదులో ఎరువులు వాడుకోవాలన్నారు. వేరశనగ పంట కీటకాలకు గురికాక ముందే గమనించాలని సూచించారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తామని ఎవరైన అర్హులై ఉండి కార్డులు అందకపోతే వీఆర్వోల ద్వారా నమోదు చేసుకోవాలన్నారు. ఏవో కవిత పాల్గొన్నారు.

కోట: మండల పరిధిలోని ఊనుగుంటపాళెంలో గురువారం రైతులు సాగులో పెట్టిన వరి పొలాలను జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు, ఏడీఏలు ధనంజయరెడ్డి, సుచేంద్రప్రసాద్ పరిశీలించారు. సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. స్థానిక రైతు సేవా కేంద్రంలో కౌలు రైతులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు.

అమృత్‌భారత్‌తో గూడూరు హ్యాపీ



గూడూరు అర్బన్, జూలై 25: కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీవైష్ణవ్ బుధవారం ప్రకటించిన 2024-25 రైల్వేబడ్జెట్‌లో కొత్తగా ప్రకటించిన పథకాల్లో గూడూరుకు ప్రాధాన్యం ఇవ్వడంతో ఈ ప్రాంతవాసుల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. అమృత్‌భారత్ ప్రాజెక్టులో గూడూరుకు చోటు దక్కడం, గూడూరు- విజయవాడ మూడో లైన్ ప్రాజెక్టు పనులకు తాజా బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయింపులతో రైల్వేస్టేషన్‌లో అధునాతన సదుపాయాలు ప్రయాణికులకు చేరువ కానున్నాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే గూడూరు చల్లకాలువ సమీపంలో 2 కిలోమీటర్ల మేర గూడూరు రైల్వే ఫ్లైఓవర్ ట్రాక్ నిర్మాణం రికార్డుస్థాయిలో పూర్తికావడం, 5 ప్లాట్‌ఫాంల విస్తరణ, వందశాతం విద్యుద్దీకరణ పూర్తి, వైఫై, నాణ్యమైన వసతులు గూడూరు రైల్వేస్టేషన్‌లో అందుబాటులో ఉన్నాయి. అమృత్ పథకం కూడా పూర్తయితే మరిన్ని సేవలు అందుబాటులోకి రానున్నాయి.

అక్రమ ఇసుక ట్రాక్టర్ పట్టివేత

నాయుడుపేట టౌన్, జూలై 25 : మండలంలోని పుదూరు గ్రామ సమీపంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం వాహన తనిఖీలు చేపడుతుండగా ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కారు అపహరణకు యత్నం



చిట్టమూరు, జులై 25: పట్టణంలోని కొత్తగుంట సెంటర్లో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు కారును అపహరించుకెళ్లేందుకు ప్రయత్నించారు. పల్లంపర్తికి చెందిన ఎస్.బాబు కొత్తగుంటలో ఉన్న తన నివాసం వద్ద రోడ్డు పక్కన తన కారును పార్కింగ్ చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు రాత్రి కారు అద్దాలు పగలగొట్టి అపహరించేందుకు ప్రయత్నించారు. కారు స్టీరింగ్ వద్ద వైర్లు విప్పి కొంత దూరం నెట్టుకెళ్లారు. అయినప్పటికీ స్టార్ట్ కాకపోవడంతో తమతో తెచ్చుకున్న స్పానర్లు అక్కడే వదిలేసి పరారయ్యారు. గురువారం ఉదయం గమనించిన బాబు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ చినబలరామయ్య కారును పరిశీలించారు. సీసీ పుటేజీలను పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

దివ్యాంగులపై వివక్ష తగదు

కోట, జూలై 25: తమపై వివక్ష చూపడం బాధాకరమని పలువురు దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేశారు. కోట పట్టణంలో గురువారం పలు దివ్యాంగ సంఘాల నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఐఏఎస్ అధికారి దివ్యాంగుల పట్ల వ్యవహరించిన తీరు మంచిదికాదన్నారు. అత్యున్నత పదవుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ అవసరం లేదని చెప్పడం భావ్యం కాదన్నారు. తక్షణం ఆ ఐఏఎస్ అధికారి దివ్యాంగులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని లేకపోతే ఉద్యమిస్తామన్నారు. అనంతరం కోట మండల దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గూడూరు కృష్ణ, ఉపాధ్యక్షుడు వి.సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆ అధికారికి వ్యతరేకంగా నినాదాలు చేశారు.

ఎంబీయూలో 'నార్ల్' భాగస్వామ్యంతో హై-అల్టిట్యూడ్ బెలూన్ శాటిలైట్ ప్రాజెక్ట్ ప్రారంభం

చంద్రగిరి, జూలై 25: మండలంలోని ఎ.రంగంపేట సమీపంలో మోహన్‌బాబు విశ్వవిద్యాలయం, జాతీయ వాతావరణ పరిశోధన ప్రయోగశాల(ఎన్ఏఆర్ఎల్)తో కలిసి హై-అల్టిట్యూడ్ బెలూన్ శాటిలైట్‌ను ప్రారంభించి అతిపెద్ద మైలురాయిని సాధించింది. 2023 నవంబర్‌లో ప్రారంభమైన ఈ ప్రయోగాత్మక ప్రాజెక్ట్ ఎంబీయూను అంతరిక్ష సాంకేతికత, వాతావరణ పరిశోధనలలో అగ్రగామిగా నిలిపేలా చేస్తుంది. ఎంబీయూఎస్ఏటీ-1 ఆవిర్భావం, ఎంబీయూ విద్యార్థులు, అధ్యాపకులకు అంతరిక్ష సాంకేతికత, వాతావరణ శాస్త్రంలో ప్రాక్టికల్ అనుభవం కల్పిస్తుంది. వాతావరణ డేటాను సేకరించి, వాతావరణ అంచనాలు, విపత్తు నిర్వహణను మెరుగుపరచడం, జీవాలను కాపాడటమే ఈప్రాజెక్ట్ ముఖ్య లక్ష్యం. వివిధ ఇంజనీరింగ్ శాఖల నుంచి 25 మంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రత్యేకమైన బృందాలుగా ఏర్పాటు చేశారు. ఎన్ఏఆర్ఎల్ భాగస్వామ్యం ద్వారా, ఎంబీయూ ఈప్రయోగాన్ని కేవలం రూ.1.5 లక్షలతో సాధించగలిగింది. ఈ విజయంపై ప్రోఛాన్సలర్ మంచు విష్ణు మాట్లాడుతూ.. ఈ శాటిలైట్‌ను ప్రారంభించడం వర్శిటీ అంకితభావాన్ని తెలియజేస్తుందన్నారు.

డ్వాక్రా సభ్యులకు వ్యక్తిగత రుణాలు

పెళ్లకూరు, జూలై 25: పొదుపు మహిళలందరికీ జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు వ్యక్తిగత రుణాలు అందిస్తామని డీఆర్డీఏ ఇన్‌చార్జి పీడీ ప్రభావతి పేర్కొన్నారు. పెళ్లకూరు స్త్రీశక్తి భవనంలో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ... వ్యక్తిగత రుణాలను సకాలంలో మంజూరు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సుబ్బారెడ్డి, ఏపీఎం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ గురుకులంలో క్రీడా సంబరాలు

కోట, జూలై 25 : పట్టణంలోని బీసీ బాలుర గురుకుల పాఠశాలలో గురువారం క్రీడా దినోత్సవంలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు జరిగాయి. ఖోఖో, కబడ్డీ, తొక్కుడుబిళ్ల వంటి క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ నారాయణరావు, పీఈటీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లేగ దూడల ప్రదర్శన

వాకాడు, జూలై 25: మండలంలోని కొండాపురంలో గురువారం రాష్ట్ర పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ సౌజన్యంతో లేగదూడల అందాల పోటీలు నిర్వహించారు. జిల్లా ఉప సంచాలకుడు డాక్టర్ సోమయ్య విజేత దూడ యజమానికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సోమయ్య రాష్ట్రీయ గోకుల మిషన్ సౌజన్యంతో పెయ్యదూడల ఉత్పత్తి పథకంపై అవగాహన కల్పించారు. పాడిరైతులకు టీఎంఆర్ మిక్చర్ అందించారు. జిల్లా వ్యాప్తంగా మూగజీవాలకు వ్యాక్సినేషన్లు వేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సంచాలకుడు డాక్టర్ రమణయ్య, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ సీహెచ్ కృష్ణారావు, డాక్టర్ సురేంద్రకుమార్, డాక్టర్ విన్నమాల శ్రీహరి, శ్రీలక్ష్మి, సర్పంచ్ పుష్ప, టీడీపీ నాయకులు డి.మధురెడ్డి, టి.శ్రీనివాసులురెడ్డి, మోహన్‌నాయుడు, వేణునాయుడు, గోపీనాయుడు, కాంచన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ

చిల్లకూరు, జూలై 25: మండలంలోని మోమిడి గ్రామంలో శశికుమార్, శేషేంద్ర జ్ఞాపకార్థం నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ గురువారం ఉత్సాహంగా జరిగింది. ఉదయం అంకులపాటూరు - బూదనం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేపట్టిన అంకులపాటూరు నిర్ణీత 12 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన బూదనం 6 వికెట్ల నష్టానికి 97 పరుగులు చేసింది. మధ్యాహ్నం చెన్నూరు- వాకాడు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. మొదట బ్యాటింగ్ చేసి చెన్నూరు జట్టు నిర్ణీత 12 ఓవర్లల్లో 7 వికెట్ల నష్టానికి 80 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింట్ చేపట్టిన వాకాడు జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసింది.


రోటరీ క్లబ్ కార్యవర్గం

నాయుడుపేట, జూలై 25: నాయుడుపేట రోటరీ క్లబ్ నూతన కార్యవర్గాన్ని జిల్లా రోటరీ గవర్నర్ డాక్టర్ సీఏ సాధుగోపాలకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పి.జయరాజ్‌గోపాల్, గౌరవ అధ్యక్షుడిగా కె.జనార్దన రెడ్డి, కార్య దర్శిగా ఎన్.రామమోహన్, ఉపాధ్యక్షులుగా డి.ప్రభాకర్‌నాయుడు, బి.సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా వై.లక్ష్మీనారాయణ రావు సహా సభ్యులను ఎన్నుకున్నారు.

టైం మేనేజ్‌మెంట్‌పై అవగాహన

సూళ్లూరుపేట, జూలై 25: పట్టణంలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం జేసీఐ, కళాశాల ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ సంయుక్తంగా హెల్త్ అండ్ హైజీన్, టైం మెనేజ్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎల్‌బి శంకర్ శర్మ ప్రారంభించారు. అనంతరం ప్రముఖ వైద్యురాలు నూరిపారి టైం మేనేజ్ంట్, హెల్త్ అండ్ హైజీన్ ప్రాధాన్యతను వివరించారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తగా ఉండాలని మంచి ఆహారం తీసుకొంటే అదే ఆరోగ్యానికి రక్షణ అని తెలిపారు. ప్రతి అంశంపై అవగాహన కలిగి ఉండే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జేసీఐ అధ్యక్షుడు శరత్, జేకేసీ కోఆర్డినేటర్ సుబ్రమణ్యం, ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ విక్టోరియా రాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.98 కోట్లు



ప్రమోదదేవి

తిరుమల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.98 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి, గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 73,023 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 26,942 మంది తలనీలాలు సమర్పించారు. తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మేఘాలయ హైకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్, మైసూరు సంస్థానం మహారాణి ప్రమోదదేవి, తిరుపతి మేయర్ శిరీష, కమిషనర్ మౌర్య ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా మైసూర్ సంస్థానం మహారాణి ప్రమోదదేవి గురువారం పద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.